# తెలుగుతోట 5

సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## తెలుగు వాచకం

C7J8F8



Scanned with CamScanner

G8Y9D2

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|
| 1. | ఏ దేశమేగినా (సంసిద్ధతా పాఠం) | దేశభక్తి | గేయం | జూన్ | 1- 6 |
| 2. | సాయం (సంసిద్ధతా పాఠం) | పరోపకారం (భూతదయ) | కథనం | జులై | 7-12 |
| 3. | కొండవాగు | ప్రకృతి వర్ణన | లేఖ | ఆగష్టు | 13-22 |
| 4. | జయగీతం | మహనీయుల చరిత్ర | పాట | సెప్టెంబరు | 23-32 |
| 5. | తోలుబొమ్మలాట- ఒక జానపదకళ | కళలు | వ్యాసం | అక్టోబరు | 33-42 |
| 6. | పెన్నేటి పాట | పర్యావరణం | పాట | నవంబర్ | 43-50 |
| 7. | పద్యరత్నాలు | నైతిక విలువలు | పద్యాలు | డిసెంబర్ | 51-58 |
| 8. | ఇటిజ్ పండుగ | సంస్కృతీ సంప్రదాయాలు | సంభాషణ | జనవరి | 59-68 |
| 9. | తరిగొండ వేంగమాంబ | స్త్రీ శక్తి | వ్యాసం | ఫిబ్రవరి | 69-76 |
| 10 | మంచి బహుమతి | పఠనాభిలాష | సంభాషణ | మార్చి | 77-86 |
| | పునశ్చరణ | | | ఏప్రిల్ | |





Scanned with CamScanner

సంసిద్ధతా పాఠం

# 1. ఏదేశమేగినా ...





చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.

1. చిత్రంలో ఏం జరుగుతున్నది?
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏమేం చేస్తున్నారు?
3. మీ బడిలో జెండా ఎప్పుడెప్పుడు ఎగరవేస్తారు? ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తారు?

## కవి పరిచయం

**రాయప్రోలు సుబ్బారావు** (13-03-1892 - 30-06-1984)

రాయప్రోలు సుబ్బారావు అభినవ నన్నయ బిరుదాంకితుడిగా, నవ్య కవితా పితామహుడిగా పేరుపొందారు. 'తృణకంకణం', 'స్నేహలత', 'స్వప్నకుమారం', 'కష్టకమల', 'ఆంధ్రావళి', 'జడకుచ్చులు', 'వనమాల' మొదలైన కావ్యాలను రచించారు. 'రమ్యాలోకం', 'మాధురీదర్శనం' అనే లక్షణ గ్రంథాలు రాశారు. వీరి భాషా సేవను గుర్తించి భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది.





Scanned with CamScanner

# ఏ దేశమేగినా ...



ఏదేశమేగినా, ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని!
నిలుపరా నీజాతి నిండు గౌరవము!

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో
జనియించినాడవీ, స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్, ప్రేమించినావో
నిను మోచె ఈ తల్లి, కనక గర్భమున!



Scanned with CamScanner




లేదురా ఇటువంటి, భూదేవి యెందు
లేరురా మనవంటి, పౌరు లింకెందు
సూర్యుని వెలుతురుల్, సోకు నందాక
ఓడల జెండాలు ఆడు నందాక!

అందాక గల ఈ, యనంత భూతలిని
మన భూమి వంటి, చల్లని తల్లి లేదు
పాడరా నీ తెన్గు, బాల గీతములు
పాడరా నీ వీర, భావ భారతము!



Scanned with CamScanner

## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| పీఠం | = | గద్దె, సింహాసనం | కాలిడు | = | అడుగు పెట్టు |
| యోగం | = | అదృష్టం | భారతి | = | భారతదేశం |
| స్వర్గ ఖండం | = | స్వర్గంలాంటి ఈ భారత దేశం | గర్భము | = | కడుపు |
| జనియించుట | = | పుట్టుట | సోకు | = | తగులు |
| తెన్గు | = | తెలుగు | అనంతం | = | అంతులేనిది |

## ఇవి చేయండి





### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
2. గేయ భావం సొంత మాటల్లో చెప్పండి.
3. మీకు తెలిసిన దేశభక్తి గేయాలు పాడండి.
4. మీ బడిలో జరుపుకునే జెండా పండుగ గురించి చెప్పండి.



### పదజాలం

అ) కింది పదాలను చదవండి.

| | | | | |
|---|---|---|---|---|
| వల | పలక | నడవడం | అమల | ఎండ |
| పనస | ఊయల | బలపం | ఒక | ఇల |
| ఈత | ఎర | ఋణం | మర | గంప |
| రమ | దయ | మలమల | శంఖం | జరజర |
| ఓడ | ఊతం | తడక | హంస | సకలం |
| చలమ | టంకం | డమడమ | ఏతం | గజగజ |



Scanned with CamScanner

ఆ) కింది అక్షరాలతో మొదలయ్యే పదాలను రాయండి.

| | | | |
|---|---|---|---|
| క ________ | డ ________ | బ ________ | వ ________ |
| గ ________ | త ________ | మ ________ | శ ________ |
| చ ________ | ద ________ | య ________ | ష ________ |
| జ ________ | న ________ | ర ________ | స ________ |
| ట ________ | ప ________ | ల ________ | హ ________ |

ఇ) కింది గుణింతాలతో పదాలను రాయండి.

| | | | |
|---|---|---|---|
| ✓ ________ | ు ________ | ె ________ | ొ ________ |
| ా ________ | ూ ________ | ే ________ | ో ________ |
| ి ________ | ృ ________ | ై ________ | ౌ ________ |
| ీ ________ | | | |



## ప్రశంస



ప్రపంచమంతా కరోనా వంటి మహమ్మారి వ్యాపించినప్పుడు వైద్యులు, నర్సులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు ప్రజలను కాపాడడంలో విశేష కృషి చేసారు. వారి ప్రాణాలు సైతం పణంగా పెట్టారు. మీరు తోటివారిలోని మంచిని, శ్రమ విలువను ప్రశంసిస్తూ మాట్లాడండి.



## ధారణ చేద్దాం

ఆంధ్రభాష యమృత మాంధ్రాక్షరంబులు
మురువు లొలుకు గుండ్ర ముత్తియములు
ఆంధ్రదేశ మాయురారోగ్య వర్ధకం
బాంధ్రజాతి నీతి ననుసరించు

**భావం :-** ఆంధ్రభాష అమృతం వంటిది. తెలుగు అక్షరాలు గుండ్రంగా ముత్యాల్లాగా ఉండి అందా లొలుకుతూ ఉంటాయి. ఆంధ్రదేశం ఆయుష్షును, ఆరోగ్యాన్ని వృద్ధిచేస్తుంది. ఆంధ్రజాతి ధర్మాన్ని అనుసరించి నడుచుకొంటుంది.

– వేటూరి ప్రభాకరశాస్త్రి



Scanned with CamScanner



చదువుదాం

# వివేకానందుని షికాగో ప్రసంగం



**"ఏ దేశమేగినా ఎందుకాలిడిన పొగడరా నీతల్లి భూమి భారతిని"** అని ఎక్కడికి వెళ్ళినా మన దేశపు గొప్పతనాన్ని తెలియజేయాలని తెలుసుకున్నారు కదా? అలా మన దేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసినవారు స్వామి వివేకానంద. అదేంటో ఆయన షికాగోలో చేసిన ప్రసంగం ద్వారా తెలుసుకోండి.

1893 సెప్టెంబరు 11వ తేదీ ఉదయం స్వామి వివేకానందునితో పాటు సర్వమత మహాసభ ప్రతినిధులందరూ షికాగోలోని కొలంబస్ హాలులోని ఒక విభాగంలో సమావేశమయ్యారు.



వచ్చిన ప్రతినిధులంతా ఒకరి తరువాత ఒకరు ప్రసంగిస్తున్నారు. వివేకానందుని వంతు వచ్చింది. వివేకానందుడు లేచాడు. ఒక్కక్షణం తన ఇష్టదైవాన్ని తలచుకుని **"అమెరికా దేశపు సోదరసోదరీమణులారా!"** అంటూ సంబోధించాడు. ఆ సంబోధనతో అక్కడ అందరిని ఒక మహోత్సాహం ఆవహించింది. చెవులు చిల్లులుపడేటట్లు కరతాళధ్వనులు మిన్నంటాయి. వివేకానందుడు ఆ కరతాళ ధ్వనుల మధ్య కాసేపు మాట్లాడలేకపోయాడు. ఈ ఘనమైన స్వాగతానికి ఆయన చలించిపోయాడు.

తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ "సమస్త మతాలకు, సమస్త ధర్మాలకు సనాతనధర్మం తల్లి అనదగింది. సహనాన్ని, సర్వమత సత్యత్వాన్ని లోకానికి బోధించిన సనాతనధర్మం నా ధర్మం. సర్వమత సహనాన్నే కాక, సర్వమతాలు సత్యాలనే మేం విశ్వసిస్తాం. పరపీడితులై, శరణాగతులై వచ్చిన వారికి శరణ్యమైన దేశం నా దేశం. శాఖాభిమానం, మతమౌఢ్యం లాంటి వాటిని ఖండించి అవి లేనట్టి ఒక సమాజాన్ని రూపొందించాలనే ఒక సదుద్దేశంతో మీ ముందుకు వచ్చాను" అని అన్నాడు వివేకానందుడు. అన్ని మతాలు ఒకటేననీ, ఆ మతాలలో జరిగే పూజా విధానాలన్నీ భగవంతుడి తత్వాన్ని తెలియజేసేవేననీ వివేకానందుడు చెప్పాడు.

"ప్రార్థనలు, కర్మకలాపాలు చిత్తశుద్ధికి పనికివస్తాయి. విగ్రహారాధన ధ్యానానికి ఉపయోగపడుతుంది. భగవంతుని దర్శనం లభించాలంటే ముందు మనలోని అహంకారం నశించాలి" అని వివేకానందుడు చెప్పాడు.

వివేకానందస్వామి సనాతన ధర్మం గొప్పతనాన్ని లోకానికి తెలియజేశాడు. ఈ ప్రసంగం ద్వారా ప్రపంచ ప్రజలకు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటాడు.

- స్వామి చిరంతనానంద




Scanned with CamScanner

సంసిద్ధతా పాఠం

# 2. సాయం

V8D6X1



చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.

1. చిత్రంలో ఏం జరుగుతున్నది?
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏమేం చేస్తున్నారు?
3. మీరెప్పుడైనా ఎవరికైనా సహాయం చేసారా? అప్పుడు మీకేమనిపించింది.

## కవి పరిచయం



**జాక్‌కోప్ (1913 - 1991)**

జాక్‌కోప్ దక్షిణాఫ్రికా నవలా రచయిత, కథా రచయిత, కవి, సంపాదకులు. ఇది ఒక అనువాద కథ.



Scanned with CamScanner



# సాయం

రవికి పక్షులంటే చాలా ఇష్టం. వాటి మధురమైన కిలకిలారావాలు వినడం మరీ ఇష్టం. రవి నిద్రలేవగానే కిటికీ దగ్గరకు వచ్చి నిలబడతాడు. అక్కడ ఉన్న పక్షులను చూస్తూ, వాటి ధ్వనులు వింటూ తన దినచర్యను మొదలెడతాడు. ఈ అందమైన చిన్నచిన్న పక్షులు ఎక్కడనుండి వస్తాయో? ఎక్కడికి వెళతాయో? అని ఆలోచిస్తుంటాడు.

ఒకరోజు ఉదయం ఒక పెద్ద పక్షుల గుంపు వచ్చింది. రోజులాగే అవి విద్యుత్ తీగలమీద కూర్చున్నాయి. కిచకిచ మంటూ రెక్కలాడిస్తున్నాయి. చీటికి మాటికి ఎగురుతూ మళ్ళీ వచ్చి అదే తీగపై వాలుతున్నాయి. ఇదంతా రవి ఆసక్తిగా చూస్తున్నాడు. కొద్దిసేపటికే ఒకటొకటి పక్షులన్ని ఎగిరిపోసాగాయి. కానీ ఒక పిచ్చుక అక్కడే ఉండిపోయింది. అది ఎగరడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఎగరలేకపోతోంది. రవి ఆ పిచ్చుకని చూశాడు. ఆ పిచ్చుక కాలు తీగలో ఇరుక్కుపోవడాన్ని గమనించాడు.

"అమ్మా! అటు చూడు ఆ పిచ్చుక తీగలో ఇరుక్కుపోయింది" అన్నాడు. "ఫరవాలేదు లేరా! కాసేపైతే అదే ఎగిరిపోతుంది" అంది వాళ్ళ అమ్మ. "కాదమ్మా! దాని కాలు తీగలో ఇరుక్కుపోయింది. అందుకే ఎగరలేకపోతోంది" అన్నాడు. "ఇలా తీగల్లో ఇరుక్కుపోతూనే ఉంటాయి. నువ్వు లోపలకి రా! దాని గురించి నువ్వేమి ఆందోళన పడాల్సిన అవసరం లేదు."

"పాపం అమ్మా! నువ్వు కాస్త ఆలోచించు. అది ఈ తీగలో రాత్రంతా ఇరుక్కుపోయి ఉంటే ఏమవుతుందో?"

"ఏమీ అవదు నువ్వు పొద్దున లేచేసరికి అది ఎగిరిపోయి ఉంటుంది చూడు" అంది అమ్మ.

రవి రాత్రంతా ఇదే ఆలోచనతో పడుకున్నాడు. పిచ్చుకకి ఏమీ కాకూడదని కోరుకున్నాడు.

మరుసటి రోజు ఉదయం లేవగానే పిచ్చుక గుర్తుకొచ్చింది. గబగబా బయటకెళ్ళి తీగవైపు చూశాడు. అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.



Scanned with CamScanner

ఆ పిచ్చుక అలాగే ఉంది. కాని పిచ్చుక చుట్టూ ఇతర పక్షులు చేరాయి. తీగకు ఇరుక్కున్న పిచ్చుక నోరు తెరచి ఉంది. పక్షులన్నీ దాని నోటికి ఆహారం అందిస్తున్నాయి.

రవి ఇంట్లోకి పరుగెత్తికెళ్ళి వాళ్ళ అమ్మ చెయ్యి పట్టుకుని బయటికి లాక్కువచ్చాడు.

"చూడమ్మా! ఆ పక్షులన్నీ దానికి తిండిపెడుతున్నాయి." అమ్మ కూడా ఆశ్చర్యంగా చూసింది.

రవికి ఇదంతా ఆశ్చర్యంగా, వింతగా అనిపించింది. నిజమే ఆ పక్షులన్నీ కష్టంలో ఉన్న పిచ్చుకకి సహాయం చేస్తున్నాయి. కానీ మనిషి మాత్రం పట్టించుకోవడం లేదు. అందరూ చూసి కూడా చూడనట్టు ఉంటున్నారు అనుకున్నాడు.

ఇంతలో అక్కడికి వాళ్ళ నాన్న వచ్చాడు. రవి ఆశగా "నాన్నా! నాన్నా! ఆ పిచ్చుక చూడు పాపం తీగలో ఇరుక్కుపోయింది. దాన్ని ఎలాగైనా కాపాడుదాం నాన్నా!" అన్నాడు.

"ఆ తీగలు చాలా పైకి ఉన్నాయిరా! దానిపైకి ఎక్కడం చాలా కష్టం. అందులోనూ కరెంటు తీగలు."


"మరి దాన్ని ఎవరు కాపాడుతారు నాన్నా?" అడిగాడు రవి.

"ఆ పిచ్చుకను కాపాడాలంటే ఒకటే మార్గం. ఎవరైనా విద్యుత్ సరఫరా ఆఫీసుకు వెళ్ళి విద్యుత్ సరఫరా ఆపివేస్తే దాన్ని రక్షించవచ్చు. అది కూడా విద్యుత్ ఆఫీసు వాళ్ళే వచ్చి చేయాలి. నువ్వు ముందు బడికి బయలుదేరు. ఇప్పటికే ఆలస్యం అయింది" అన్నాడు.

రవి బడికి బయలుదేరాడు. దారిలో నడుస్తున్నా ఆ పిచ్చుకే గుర్తుకు వస్తోంది. విద్యుత్ ఆఫీసులో ఎవరెళ్ళి చెబుతారు? ఆ పిచ్చుకను ఎవరు కాపాడుతారు? ఎవరి గురించీ ఎదురు చూడకూడదు. నేనే దాన్ని కాపాడుతా అనుకుంటూ రవి నేరుగా విద్యుత్ ఆఫీసు వైపు వెళ్ళాడు.

విద్యుత్ ఆఫీసు లోపలికి గబగబా వెళ్ళాడు. అక్కడ కుర్చీలో కూర్చున్న అతనితో "సర్! సర్! మీరు కొద్దిసేపు కరెంటు ఆపుచేస్తే ఆ పిచ్చుక బతుకుతుందండీ" అన్నాడు.

కుర్చీలో కూర్చున్న వ్యక్తి రవి మాటలు విని నవ్వి "నువ్వెవరు? ఎక్కడ ఉంటావు? విద్యుత్ ఆపడమేంటి? పిచ్చుకను కాపాడడమేంటి?" అంటూ ప్రశ్నలు కురిపించాడు. తన ఇంటిముందు పిచ్చుక ఇరుక్కుపోయిన సంగతంతా పూస గుచ్చినట్లు చెప్పాడు రవి.




రవి చెప్పినదంతా విని ఆ వ్యక్తి "నువ్వు ఎవరి అబ్బాయివి? మీ ఇల్లు ఎక్కడో చెప్పు. నేను మనిషిని పంపుతానులే, నువ్వు ఇంటికి వెళ్ళు" అన్నాడు. "సార్! నేను రాఘవ గారి అబ్బాయిని. మేము పోస్టాఫీసు వీధిలో ఉంటాం. మీ వాళ్ళను తొందరగా పంపండి. పాపం పిచ్చుక అరుస్తుంటే ఏడుస్తున్నట్లు ఉంది" అన్నాడు. అతను నవ్వుతూ అలాగే! అన్నాడు.

రవి ఇంటికి వచ్చేసాడు. సాయంత్రం అయింది. ఇంకా ఎవరూ రాలేదేమిటి? అసలు వస్తారా రారా! ఎవరూ రాకపోతే ఈ పిచ్చుక చనిపోతుంది కదా! ఇలాంటి ఆలోచనలు రావడంతో రవి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.



Scanned with CamScanner



"ఏరా రవీ! ఆడుకుందాం రా" అని రవి అక్క పిలిచింది. "నేను రాను పో" అని మంచం మీద పడుకున్నాడు. పిచ్చుక గురించే ఆలోచిస్తున్నాడు.

కొంతసేపటికి "రవీ! నీ కోసం ఎవరో వచ్చారు చూడు" అంటూ అమ్మ పిలిచింది. రవి బయటకు వచ్చాడు. ఎదురుగా విద్యుత్ ఆఫీసులో పనిచేసే వ్యక్తి. అతనితో బాటు నిచ్చెనతో మరో మనిషి.

రవి కళ్ళు ఆనందంతో మెరిసాయి.

"వచ్చేసారా! రండి సర్!"

ఆ వ్యక్తి నవ్వుతూ "విద్యుత్ ఆపు చేసాములే. పిచ్చుకను రక్షిద్దాం. నువ్వు కూడా రా!" అన్నాడు.

అందరూ కలిసి బయటకు వెళ్ళారు. వచ్చిన వ్యక్తి నిచ్చెన వేసుకుని పైకి ఎక్కి జాగ్రత్తగా పిచ్చుక కాలును తీసి విడిపించాడు. కిందికి దిగివచ్చి ఆ పిచ్చుకను రవి చేతిలో పెడుతూ ... "ఇదిగో నీ పిచ్చుక బతికే ఉంది. సంతోషమే కదా!" అన్నాడు. రవి ఆత్రంగా ఆ పిచ్చుకని చేతిలోకి తీసుకున్నాడు. మెల్లగా దాన్ని నేలమీద వదిలిపెట్టాడు.

పిచ్చుక ఎగరడానికి ప్రయత్నించింది. కానీ కొద్దిగా పైకి ఎగిరి కింద పడిపోయింది. కుంటుతూ నడిచింది. కొద్ది సేపటికి అది మళ్ళీ ఎగరడానికి ప్రయత్నించింది. ఈసారి ఎగరడంలో సఫలీకృతం అయ్యింది. కిచ్ కిచ్ మంటూ గాల్లోకి ఎగిరింది.

రవి ఆనందానికి అవధులు లేవు. "అమ్మా! పిచ్చుక ఎగిరిపోయింది" అంటూ గట్టిగా చప్పట్లుకొట్టాడు.

## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| దృశ్యం | = | చూడదగినది | అవధులు | = | హద్దులు |
| కష్టం | = | ఇబ్బంది | గుంపు | = | సమూహం |
| ఆత్రం | = | తొందర | ఆసక్తి | = | అపేక్ష |



Scanned with CamScanner

# ఇవి చేయండి



## వినడం - ఆలోచించి మాట్లాడటం

1. రవికి పక్షులంటే ఇష్టంకదా! మీకు ఏయే పక్షులంటే ఇష్టం?
2. 'సాయం' కథను సొంత మాటల్లో చెప్పండి.
3. మీ స్నేహితులకు మీరు చేసిన ఏదైనా సాయం గురించి చెప్పండి.

## పదజాలం

అ) ఈ కింది ఒత్తు ఉన్న పదాలను రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| క్క | ________ | ట్ట | ________ | మ్మ | ________ |
| గ్గ | ________ | త్త | ________ | య్య | ________ |
| చ్చ | ________ | ద్ద | ________ | ్ర | ________ |
| జ్జ | ________ | ప్ప | ________ | ల్ల | ________ |

## ప్రాజెక్టు పని

మీ పాఠశాల గ్రంథాలయంలో ఇతరులకు సాయం చేసే అంశం ఉన్న కథలు సేకరించండి. మీ తరగతిగదిలో ప్రదర్శించండి.

## ధారణ చేద్దాం

గువ్వ కొరకు మేనుకోసి యా శిబిరాజు
వార్త విడువరాక కీర్తి కెక్కె
ఓగు నెంచబోవ రుపకారి నెంతురు
విశ్వదాభిరామ వినుర వేమ!


భావం :- తన దేహమునే కోసి ఇచ్చి పావురాన్ని కాపాడి శిబి చక్రవర్తి కీర్తి పొందాడు. చెడ్డవారిని ఎవరూ తలుచుకోరు. ఉపకారం చేసే వారిని అందరూ గుర్తుంచుకుంటారు.

- వేమన



Scanned with CamScanner

## అనకు కనకు వినకు



అది సబర్మతీ ఆశ్రమం. గాంధీజీ ఒక్కరే చిరుచాప మీద కూర్చొని ఉన్నారు. ఆయన అప్పుడే భగవద్గీత పారాయణం చేసి పుస్తకాన్ని ముందున్న చెక్కపెట్టెమీద పెట్టారు. నిన్న ఎవరో తనకు బహుమానంగా తెచ్చిన బొమ్మ వైపు దీక్షగా చూస్తున్నారు బాపూజీ. మహాదేవ దేశాయ్ లోపలికి వచ్చాడు. తదేకధ్యానంగా ప్రతిమవైపు చూస్తున్న బాపూజీని చూచాడు. ఏకాగ్రతతో ఉన్న గాంధీజీకి వెనుకనుంచి ఎవరో నవ్వుతున్నట్లు అనిపించింది. బాపూ వెనక్కు తిరిగి చూచారు. మహాదేవ దేశాయ్ నిలబడి నవ్వుతూ కనిపించాడు.

"మహాదేవ్ భాయీ! రా! కూర్చో! ఎందుకు నవ్వుతున్నావు?" అన్నాడు గాంధీజీ.


"మిమ్మల్ని మీరు మరచి ఆ పెట్టెమీది బొమ్మనే చూస్తుంటే నాకు నవ్వు వచ్చింది బాపూజీ!" అని దేశాయ్ మళ్లీ పకపకా నవ్వటం మొదలెట్టాడు. గాంధీజీ దేశాయ్ భుజం మీద చెయ్యి వేసి తట్టుతూ "అసలీ బొమ్మను చూశావా? ఎంత గొప్పగా ఉన్నదో!" అన్నాడు.

"అవును మూడు కోతులూ చాలా అందంగా ఉన్నాయి" అన్నాడు దేశాయ్. "కోతులు కాదు, అవి నా గురువులు" అని, గాంధీజీ ఆ కోతుల బొమ్మను మహాదేవ దేశాయ్‌కి చూపిస్తూ "ఇదుగో చూడు ఈ బొమ్మలో మూడు కోతులు కన్పిస్తున్నాయి కదా! అవి మూడూ మూడు పనులు చేస్తూ మనకు మూడు విధాలైన ఉపదేశాలు ఇస్తున్నాయి.

"మొదటి బొమ్మ చూడు రెండు చేతులతో నోరుమూసుకొని కూర్చుంది. అంటే చెడు మాట్లాడవద్దు అని, రెండో బొమ్మ రెండు చేతులతో రెండు కళ్లూ మూసుకొని కూర్చుంది. అంటే చెడు చూడకు అని అర్థం" అన్నాడు గాంధీజీ.

గాంధీజీ మాటలు విని మహాదేవ దేశాయ్ ఆశ్చర్య చకితుడయ్యాడు.

"మూడో బొమ్మ వైపుచూచి ఏం చేస్తున్నదో చెప్పు" అన్నాడు మళ్లీ గాంధీజీ.



"అది తన రెండు చేతులతో గట్టిగా రెండు చెవులు మూసుకుంది" అన్నాడు దేశాయ్.

"దానర్థం ఏమిటంటే చెడు మాటల్ని వినవద్దు అని అది మనల్ని హెచ్చరిస్తున్నది. మొత్తం మీద ఈ మూడు కోతులూ 'చెడు అనకు, చెడు కనకు, చెడు వినకు' అని మానవులకు హితోపదేశం చేస్తున్నాయని నా ఉద్దేశం. ఏమంటావ్?" అన్నాడు.

"బాపూజీ! మీరు మట్టిలో నుంచి మాణిక్యాలు వెలికి తీయగలరు. అందుకనే మీరు మహాత్ములు. మీ భావాన్ని అందుకోలేక నవ్వినందుకు నన్ను మన్నించండి" అని బాపూజీ పాదాలు స్పృశించాడు మహాదేవ్‌జీ.

### కవి పరిచయం

**జంధ్యాల పాపయ్యశాస్త్రి (4-08-1912 - 21-06-1992)**



జంధ్యాల పాపయ్యశాస్త్రి కరుణశ్రీగా సుప్రసిద్ధులు. 'ఉదయశ్రీ', 'విజయశ్రీ', 'కరుణశ్రీ', 'అరుణ కిరణాలు' మొదలైనవి వీరి ప్రసిద్ధ ఖండకావ్యాలు. పిల్లల కోసం తెలుగుబాల శతకం రచించారు.



Scanned with CamScanner

# 3. కొండవాగు

D7G3R9




**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. పై బొమ్మలో మీకు ఏమేం కనిపిస్తున్నాయి?
2. పిల్లలంతా ఎక్కడకు వెళ్తున్నారు?
3. మీరు చేసిన ఒక ప్రయాణం గురించి చెప్పండి.

## కవి పరిచయం

### చెరుకుపల్లి జమదగ్ని శర్మ (1920 - 1986)




చెరుకుపల్లి జమదగ్నిశర్మ కవి, కథకుడు. 'జమదగ్ని' అనే కలం పేరుతో రచనలు చేశారు. 'మహోదయం', 'చిలుకా గోరింక', 'అన్నదమ్ములు', 'ధర్మదీక్ష' మొదలైనవి వీరి రచనలు. పిల్లల మనస్తత్వ చిత్రణ ప్రధానంగా కథలు రాశారు.




Scanned with CamScanner

ప్రియమైన వెంకట్,

నేను క్షేమంగా ఉన్నాను. నువ్వు, మన స్నేహితులు రహీం, డేవిడ్ ఎలా ఉన్నారు? నేను మొన్న దసరా సెలవులకు రామం వాళ్ళ ఊరు వెళ్ళాను. వాళ్ళ ఊరు నాకు భలే నచ్చింది. ఆ ఊరి విశేషాలు నీతో చెప్పకుండా ఉండలేను.



నేను, రామం, సూర్య ఆ రోజు మధ్యాహ్నం ఊరి పరిసరాలు చూడడానికి వెళ్ళాం. ఆ ఊరి చుట్టూ రకరకాల కొండలు, వాగులు, పచ్చనిచెట్లు ఉన్నాయి. ఆ ఊరికి ఆనుకుని ఒక ఊటవాగు పారుతోంది. ఆ ఊరివాళ్ళు దానిని కామధేనువుగా భావిస్తారు. దాని వెంబడి కొంతదూరం ఇసుక మేటవేసి లంకగా ఏర్పడింది. చుట్టూరా బిలబిలమంటూ నీళ్ళు పారుతుంటే అక్కడ కాసేపు ఆనందంగా కూర్చున్నాం. అక్కడ కూర్చున్నంతసేపూ ఆ వాగు ఎక్కడ పుట్టింది? అక్కడికి ఎలా వెళ్ళడం? అని ఆలోచనలు కలిగాయి. వెంటనే, "ఈ వాగు పుట్టిన చోటు ఎంత దూరం ?" అని రామంని అడిగాను. "కొంచెం దూరమే కాని వెళ్లవచ్చు" అన్నాడు. సరే వెళ్దామని అందరం బయలుదేరాం.

అదంతా మిట్టపల్లాల దారి. అలాంటిచోట నడిచే అలవాటు నాకు లేదు. అలా ఒక అరగంట నడిచాం. అక్కడ కొండమీద నుండి జాలువారుతున్న బోలెడన్ని నీటిపాయలున్నాయి. అలా ముందుకు వెళ్ళాం. అక్కడ ఆ గుట్టల్లో ఉన్నది ఒక నీటిబుగ్గ. అక్కడినుండి నీళ్ళు బయలుదేరి ఇలా పాయలుగా వస్తున్నాయి. అవి కొన్ని పారుతున్నాయి. కొన్ని నృత్యం చేస్తున్నాయి. కొన్ని పాముబడకలు నడుస్తున్నాయి. కొన్ని బుసబుస పొంగుతున్నాయి. ఇవన్నీ వచ్చి ఏకమయి వాగుగా మారి ముందుకుపోతున్నాయి.

అక్కడి ఒక బండమీద కూర్చున్నాం. సింహాసనంలాంటి ఆ బండమీద కూర్చుని చూస్తుంటే సూర్యకాంతిపడి ఆ పాయలన్నీ తళతళా మెరుస్తూ కనిపించాయి. బిలబిలమంటూ అవి పారుతుంటే నాకు భలే ముచ్చటేసింది. ఆ ఉత్సాహంతో ఆ విశాలమైన బండమీద పడి గెంతుతూ "మేమే రాజులం" అంటూ గోలచేశాం. అప్పటికే మేము వచ్చి చాలాసేపయింది. సందెవేళ కావొస్తోంది. అయితే ఏం? కొండమీద వెలుగు బాగానే ఉంది. వేసవి పొద్దుకదా ఇంకా


గంటసేపు కూర్చోవచ్చు అనుకున్నాం. నామటుకు నాకు అక్కడినుండి కదలాలని అనిపించలేదు. అలా చుట్టూ చూస్తూనే కూర్చున్నాను.

అక్కడినుంచి చూస్తుంటే ఆ ప్రదేశమంతా వివిధ రంగులతో తయారు చేసిన దేశపటంలా కనిపిస్తోంది. కాలిదార్లూ, వాగులూ, రోడ్లూ అంతకంతకూ వెడల్పయిన గీతల్లా కనిపిస్తున్నాయి.

దూరాన ఉన్న ఇళ్ళన్నీ కొండపల్లి బొమ్మల్లా ఉన్నాయి. ఆ ఎత్తుమీద నుంచి చూస్తే ఎటుచూసినా ప్రకృతి సౌందర్యమే కనిపిస్తోంది.

ఈ నేల ఇంత అందంగా ఉంది అనుకుంటే ఆకాశం మరింత అందంగా ఉంది. ఆకాశం ఆ ఎత్తునుండీ చూస్తే అత్యద్భుతంగా కనిపించింది. ఒకమూల ఏ మార్పు లేకుండా వట్టి నీలంగా ఉంది. ఇంకోమూల పింజెమబ్బులు ఒకదానిమీద ఒకటి పడి దొర్లుతూ రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. తూర్పుకు తిరిగితే నల్లని మేఘాలు ఒత్తుగా కదులుతున్నాయి. అవి కాసేపు ఏనుగులు బారులు తీసి వరుసగా నడుస్తున్నట్టూ, కొన్ని కదం తొక్కుతున్నట్టు అనిపించాయి. ఇటు పశ్చిమానికి తిరిగితే భూమి, ఆకాశాలు కలిసేచోట, ఆకాశం ఎర్రని మంటతో పొగలు కక్కుతున్నట్టు ఉంది.

అలా చూస్తూ ఉండగానే చీకటిపడడం ప్రారంభించింది. మా రామం ఈలపాట పాడుతుంటే సూర్య దానికి తాళం వేస్తున్నాడు. ఇక బయలుదేరుదామని ముగ్గురమూ ఆ బండ దిగి 'ఇదెంత బాగుందిరా' 'అదెంత బాగుందిరా' అనుకుంటూ ఉత్సాహంగా ఇంటిదారి పట్టాము. చూడాలనుకోవాలే గానీ ప్రకృతిలో ప్రతి దృశ్యం అందమైనదే. వినాలనుకోవాలేగానీ ప్రకృతిలో ప్రతి శబ్దం అద్భుతమైనదే.



మన మిత్రులకు ఈ లేఖ చూపించు. మీరు కూడా ఎప్పుడో ఒకసారి ఈ ఊరు తప్పక చూడండి. నీ అనుభవాలన్నీ నాతో పంచుకుంటావుకదూ!

నీ
ప్రియమైన స్నేహితుడు,
జావేద్

## పదాలు-అర్థాలు

| | | | |
|---|---|---|---|
| మేట | = ఇసుక ప్రదేశం | పొద్దు | = రోజు, దినం |
| వాగు | = చిన్న ఏరు | దృశ్యం | = సన్నివేశం, చూడదగినది |
| జాలువారు | = జారుతున్న | బారులు | = వరుసలు |
| బాట | = దారి | లంక | = నదిలో పైకి లేచి ఉన్న భూభాగం |
| క్షేమం | = కులాసా | కదంతొక్కు | = ఉత్సాహంతో ముందుకువెళ్ళు |

## ఇవి చేయండి



### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. జావేద్ సెలవులలో రామం వాళ్ళ ఊరు వెళ్ళాడు కదా! అక్కడ ఏమేం చూశాడో చెప్పండి.
2. మీరు ఏదైనా ఊరు వెళ్ళడానికి ఏమేం సిద్ధం చేసుకుంటారో చెప్పండి.
3. మీ ఊరిలో మీకు నచ్చిన విషయాలను చెప్పండి.



### చదవడం - వ్యక్తపరచడం

అ) పాఠం చదవండి. కింది వాక్యాలు పాఠంలో ఏ పేరాలో ఉన్నాయో గుర్తించి గీత గీయండి. పేరా సంఖ్య రాయండి.

1. సూర్యకాంతిపడి ఆ పాయలన్నీ తళతళ మెరుస్తున్నాయి. ...............................
2. చూడాలనుకోవాలే గానీ ప్రకృతిలో ప్రతి దృశ్యం అందమైనదే. .........................
3. ఆ వాగు పుట్టినచోటికి ఎలా వెళ్ళడమా అనే ఆలోచన నాకు. .........................
4. మేఘాలు ఏనుగుల్లా బారులు తీసి వరుసగా నడుస్తున్నట్టు ఉంది. ...................
5. దూరాన ఉన్న ఇళ్ళన్నీ కొండపల్లి బొమ్మల్లా ఉన్నాయి. ................................



Scanned with CamScanner

అ) పేరాను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.



హెలెన్ కెల్లర్ మన అందరిలా చూడలేదు. కాని స్పర్శ ద్వారా గ్రహిస్తుంది. ఆమె ఏమంటోందో ఆమె మాటల్లోనే చూడండి. పోకచెక్క నున్నదనాన్ని, దేవదారు వృక్షాల కరకుదనాన్ని నా స్పర్శతో గుర్తిస్తాను. వసంత కాలంలో కొత్త పరిమళాల పూలకోసం అన్వేషిస్తాను. పట్టువంటి ఆ పూలరెక్కల మృదుత్వాన్ని తాకినప్పుడు, వాటి సువాసనను ఆస్వాదించినప్పుడు చెప్పలేనంత ఆనందం కలుగుతుంది. ఒక చెట్టు కొమ్మకు చేతిని ఆనించగానే ఏదో ఒక పక్షి కుహూ కుహూ శబ్దాలు చెవుల్లో మారుమ్రోగుతాయి. సెలయేటి ప్రవాహంలో చేతిని ఉంచినప్పుడు వేళ్ల సందుల నుండి నీళ్ళు ప్రవహించడం నాకు పట్టరాని ఆనందాన్నిస్తుంది.

1. హెలెన్ కెల్లర్ స్పర్శ ద్వారా ఏమేమి గుర్తించేది?

........................................................................................................

2. హెలెన్ కెల్లర్ పూలను ఎలా వర్ణించింది?

........................................................................................................

3. హెలెన్ కెల్లర్‌కి ఆనందాన్ని కలిగించినవి ఏవి?

........................................................................................................

ఇ) కీర్తన ఫిబ్రవరి 10వ తేదీన తన డైరీలో ఈవిధంగా రాసుకుంది. డైరీ చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.



10 ఫిబ్రవరి, సోమవారం

ఈ రోజు ఉదయం విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలకు వెళ్ళాం. చర్చి దగ్గర భక్తులతో చాలా రద్దీగా ఉంది. భక్తులందరూ ఉత్సాహంగా కొండపైకి నడిచి వెళుతున్నారు. మేమందరం కొండపైకి నడిచి వెళ్ళాం. ప్రార్థనలో పాల్గొన్నాం. మేరీమాతను దర్శించుకున్నాం. కొండపై నుంచి ఊరంతా భలే అందంగా కనిపించింది. అక్కడే ఉన్న బొమ్మల దుకాణాల్లో బొమ్మలు కొనుక్కున్నాం. పీచు మిఠాయి, మరమరాలు కొనుక్కుని తిన్నాం. తాజా జామకాయలు కొనుక్కున్నాం. సాయంత్రం వేళకి ఆనందంగా ఇంటికి చేరుకున్నాం.

1. ........................................................................................................

2. ........................................................................................................

3. ........................................................................................................



Scanned with CamScanner

## పదజాలం

అ) కింది గీతాన్ని చదవండి. మొదటి వాక్యం ఏ పదంతో ముగుస్తుందో, రెండవ వాక్యం ఆ పదంతో ప్రారంభమవడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. గీత గీసిన పదాలను ఉపయోగించి ఇలాంటి వాక్యాలను మీరు రాయండి.

సెలయేటి దరి నొక్క చెంగల్వ బాట ..........................................

బాట వెంటనె పోతె పువ్వుల్ల తోట ..........................................

తోటలో ఒక పెద్ద దొరలుండు కోట ..........................................

కోటలో రతనాలు కూరిచిన పీట ..........................................


పీటపై రాణుల్ల ప్రియమైన ఆట ..........................................

ఆటకే కోయిలల అందాల పాట ..........................................

పాటయే పసమించు బంగారు మూట ..........................................

ఆ) కింది పదాలు చదవండి. కొండవాగు పాఠంలో కవి వేటిని వేటితో పోల్చాడో జతపరచండి. పూర్తి వాక్యంగా రాయండి.

| | | |
|---|---|---|
| 1. | వాగు | అ) కొండపల్లి బొమ్మలు |
| 2. | బండ | ఆ) గీతలు |
| 3. | దారులు | ఇ) ఏనుగుల బారులు |
| 4. | ఇళ్ళు | ఈ) సింహాసనం |
| 5. | మేఘాలు | ఉ) కామధేనువు |



ఉదా: వాగు కామధేనువులా ఉంది.

..........................................

..........................................

..........................................

..........................................

ఇ) కింది వర్ణన పదాలు చూడండి. ఇచ్చిన పదాలకు మీరు వర్ణన పదాలు రాయండి.

వాగు
- తళతళ మెరుస్తోంది
- బిలబిల పారుతోంది
- పాము నడక నడుస్తోంది
- బుస బుస పొంగుతోంది

మేఘాలు
- ..........................................
- ..........................................
- ..........................................
- ..........................................



Scanned with CamScanner

ఈ) పట్టిక ఆధారంగా వాక్యాలను తయారు చేయండి.

| | | | | |
|---|---|---|---|---|
| నేను | విజయవాడ | వెళ్ళి | దుర్గగుడి | చూశాను |
| | ధవళేశ్వరం | | కాటన్ బారేజి | |
| | శ్రీకాకుళం | | శాలిహుండం | |
| | అరకు | | బొర్రా గుహలు | |
| | ఒంటిమిట్ట | | రామాలయం | |

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

## స్వీయరచన

**అ) పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**



1. నీటి బుగ్గ దగ్గర నుండి పాయలు ఎలా వస్తున్నాయి?
2. కొండ పై నుండి చూస్తుంటే ఊరు ఎలా కనిపిస్తుంది?
3. ఆకాశంలో మేఘాలు ఎలా కనిపిస్తున్నాయి?

## సృజనాత్మకత

**కింది పేరాను చదవండి. సంభాషణలు రాయండి.**



పిల్లలూ! 'నేలపట్టు' పేరు ఎప్పుడైనా విన్నారా? అది ఒక పక్షుల రక్షిత కేంద్రం. ఇది నెల్లూరు జిల్లా దొరవారిసత్రం మండలం సమీపంలో ఉంది. ఈ ప్రాంతానికి మేమూ, గూడబాతులు (పెలికాన్), ఎర్రకాళ్ళ కొంగలు, నల్లకాళ్ళ కొంగలు, నారాయణ పక్షులు, తెడ్డుముక్కు కొంగలు, చుక్కమూతి బాతులు, స్వాతి కొంగలు లాంటి ఎన్నో పక్షులు దేశ విదేశాల నుండి ఇక్కడకు వస్తాము. అందులో గూడబాతులు అక్కడ చెట్లపై గూళ్ళుకట్టి, గుడ్లను పొదిగి పిల్లలను చేస్తాయి. ఇంతకీ మేమెవరో చెప్పలేదు కదా! మమ్మల్ని సముద్రపు రామచిలుకలు (ఫ్లెమింగోలు) అంటారు. మేము చాలా అందంగా ఉంటాం. మేమంటే మీకే కాదు, పెద్దలకు కూడా ఇష్టమే.



Scanned with CamScanner



మా పేరుతోనే సూళ్ళూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకలు ప్రతి సంవత్సరం జనవరి నెలలో జరుపుతారు. మేము పులికాట్ సరస్సులో చేపలు వేటాడుతూ కనిపిస్తాం. అక్కడ నీళ్ళు తగ్గిపోతుంటే మా పిల్లలతో సహా మా దేశమైన నైజీరియాకు వెళ్ళిపోతాం. పిల్లలూ! మా గురించి తెలుసుకున్నారు కదా! ఒకసారి మీరు కూడా మమ్మల్ని దర్శించండి.

గిరిజ : మహిత! బాగున్నావా?

మహిత : బాగున్నాను గిరిజా. ఏంటీ విషయాలు?

గిరిజ : మేము జనవరి నెలలో పక్షుల పండుగ చూడడానికి వెళ్ళాం.

మహిత : ..............................................................................

గిరిజ : ..............................................................................

మహిత : ..............................................................................




## ప్రశంస

విహారయాత్రకు వెళ్ళినప్పుడు అక్కడి పరిసరాలలో చెత్తా చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలి. ఇలా మీరు వెళ్ళినచోట పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించిన మీ మిత్రులను ఎలా ప్రశంసిస్తావు?



## భాషాంశాలు

**అ) కింది పేరాను చదవండి.**



రాజశేఖరం కొడుకు విజయ్. అతడు పెద్ద చదువులు చదువుకున్నాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. తన తాతగారిని చూడానికి సిద్ధాంతం గ్రామానికి వచ్చాడు. తాతగారి ద్వారా గ్రామ పరిస్థితులను తెలుసుకున్నాడు. అమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తన గ్రామానికి సేవ చేయాలనుకున్నాడు. గ్రామంలోని పాఠశాల, వైద్యశాల, చెరువు మొదలైన వాటిని చూశాడు. వాటికి మరమ్మతులు చేయించాడు. ఆ ఊరిలో ఒక కాలువ ఉంది. దాన్ని బాగుచేయించాడు. ఆ ఊరికి మంచి రహదారి వేయించాడు. గ్రామ సమస్యలు చాలావరకూ పరిష్కరించాడు.

వ్యక్తుల పేర్లు, ఊర్ల పేర్లు, వస్తువుల పేర్లు, ప్రదేశాల పేర్లు, ఇలా పేర్లను తెలిపే పదాలను నామవాచకాలు అంటారని తెలుసుకదా!

**అ) కింది వాక్యాలను చదవండి. నామవాచకాలను గుర్తించండి. వాటికి కింద గీత గీయండి.**

1. సరళ మామిడిపండు తింటుంది.
2. కరీమ్ సెలవులకు పాలకొల్లు వెళ్లాడు.
3. చెల్లాయమ్మ అడవికి వెళ్ళి విస్తరాకులు తెచ్చింది.
4. శ్రీను వాళ్ల నాన్నగారు కారులో తిరుపతి వెళ్లారు.





Scanned with CamScanner

ఇ) కింది పేరాను చదవండి.

"నేను గ్రామానికి సేవ చేస్తే, దేశానికి సేవ చేసినట్లే" అని మా అమ్మ ఎప్పుడూ చెప్పేది. అమ్మ మాటలను నేను శ్రద్ధగా వినేవాడిని. తన మాటలు నా మనసులో నాటుకున్నాయి. ఆ మాటలే నా ఔదార్యానికి బాటలు వేశాయి. నా గ్రామానికి సేవ చేయాలని సంకల్పం కలిగింది. మీరు కూడా మన గ్రామానికి సేవ చేయడానికి ముందుకు రావాలి.

పై పేరాలో గీత గీసిన పదాలను గమనించండి. ఇవన్నీ నామవాచకానికి బదులుగా వాడారు. వీటిని సర్వనామాలు అంటారు.

పై వాక్యాలలో నేను-నా అన్నవి ఉన్నాయి చూశారా ? నేను అన్నది నామవాచక రూపం. నా అన్నది విశేషణ రూపం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| నేను-నా | నీవు-నీ | తాను-తన | తాము-తమ | వారు-వాళ్ల | అవి-వాని/వాటి |
| మేము-మా | మనం-మన | మీరు-మీ | అతడు/వాడు-వాడి | అది-దాని | |

సర్వనామాల ద్వితీయా విభక్తి రూపాలు కింది విధంగా ఉంటాయి.

| | | | | |
|---|---|---|---|---|
| నేను-నన్ను | మనం-మనల్ని | మీరు-మిమ్మల్ని | వాళ్లు- వాళ్ళని | అవి-వాటిని |
| తాము-తమర్ని | నీవు-నిన్ను | వాడు/అతడు - వాణ్ణి/అతన్ని | అది-దాన్ని | |

**ఈ) కింది వాక్యాలను చదవండి. సర్వనామాల కింద గీతగీయండి.**

1. కిరణ్ గ్రామ సచివాలయంలో పని చేస్తున్నాడు. ఆయన కార్యాలయం నుండి సాయంత్రం ఇంటికి వస్తాడు.
2. రాణి, దివ్య స్నేహితులు. వాళ్లు కలిసి ఆటలు ఆడతారు.
3. మేరీ పాటలు పాడుతుంది. ఆమె పాటల పోటీలో బహుమతి గెలుచుకుంది.
4. లంబసింగి అందమైన ప్రదేశం. అది చాలా చల్లగా ఉంటుంది.



## ధారణ చేద్దాం

**జననీ జనకుల గొలుచుట**
**తనయునకును ముఖ్యమైన ధర్మము జననీ**
**జనకుల గొల్చుట కంటెను**
**దనయున కభ్యధికమైన ధర్మం గలదే**

**భావం :-** తల్లిదండ్రులను సేవించడం కంటే కుమారునికి మరే ఇతర ముఖ్యమైన ధర్మం లేదు. పిల్లలకు తల్లిదండ్రులను సేవించుటకు మించిన ముఖ్యమైన పని మరొకటి లేదు.

– శ్రీనాథుడు




Scanned with CamScanner



పాడుకుందాం

# వడగళ్లు



వడగళ్లు వడగళ్లు వానదేవుని పండ్లు
వెలలేని తులలేనివెన్న ముద్దల చెండ్లు
॥ వడగళ్లు ॥

వేసవి వెళ్ళింది వడగాడ్పు మళ్ళింది
చల్లచల్లని పిల్ల వాయువులు వీచాయి
ప్రొద్దు పొగరంతాను అణిగింది మణిగింది
ఉఱుములు మెఱుపులు ఉరకలూ వేశాయి
॥ వడగళ్లు ॥

ఆకాశమంతాను ఆయాసపడ్డాది
మబ్బు దొంతర్లిట్లె ముసురుకు పోయాయి
జలజలా చుక్కల్లు గలగలా వడగళ్ళు
రాలాయి చేతుల్లొ కరిగాయి క్షణముల్లొ
॥ వడగళ్లు ॥

ఆవులూ దూడలు గంతులూ వేశాయి
చెట్లన్ని పుట్లన్ని సేదల్లు దేరాయి
భూదేవి గర్భాన మొక్కలు మొలిచాయి
క్షణములో జగమంత పచ్చబడ్డాది
॥ వడగళ్లు ॥

బీరల్లు చిక్కుళ్ళు కాకర కాసర
మల్లెలు మొల్లలు బంతిచామంతులు
విత్తులూ చల్లాము మొక్కలు నాటాము
పచ్చ పైరులువిచ్చె పచ్చసిరులన్నీని
॥ వడగళ్లు ॥

ఆకాశ మలివేణి జెడలోన మెరిసింది
ఏడురంగుల ఇంద్రధనుసు పూదండ
ఎండలు వానలు చెట్టపట్టాలతో
మాయిళ్లు వాకిళ్ళు వొళ్ళు తడిపాయి ॥ వడగళ్లు ॥

ఎండలు వానలు చిటపటల నాడుతూ
మాకళ్లు మామళ్లు మాయిళ్లు తడిపితే
అటు ఆరు బైటకు ఇటు చూరుక్రిందకు
పరుగులు తీస్తూను పకపకా ఆడాము
॥ వడగళ్లు ॥

## కవి పరిచయం

### ఏడిద కామేశ్వరరావు (12-09-1913 - 1984)



ఏడిద కామేశ్వరరావు ఆకాశవాణిలో పనిచేశారు. రేడియో అన్నయ్యగా ప్రసిద్ధులు. 'రాష్ట్రగీతం', 'జైలు రోజులు', 'ఇండోనేషియా చరిత్ర' మొదలయిన రచనలు చేశారు. బాలల కోసం ఎన్నో పాటలూ నాటికలూ రాశారు.



Scanned with CamScanner

# 4. జయగీతం



**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో ఏం జరుగుతున్నది?
2. ఎవరెవరు ఉన్నారు? ఇలాంటివి మీ పాఠశాలలో ఏమేమి జరుగుతాయి.
3. మీకు తెలిసిన దేశ నాయకుల గురించి చెప్పండి.

## కవి పరిచయం

### బోయి భీమన్న (19-09-1911 - 16-12-2005)



బోయి భీమన్న కవి, నాటకకర్త. 'పాలేరు', 'కూలిరాజు' వంటి నాటికలు, 'గుడిసెలు కాలిపోతున్నాయి', 'మధుగీత' వంటి ఖండకావ్యాలు రచించారు. వీరు పద్యం, పాట, వచనం మూడింటిలోను సిద్ధహస్తులు. 'పాలేరు నుంచి పద్మశ్రీ వరకు' అన్నది వీరి స్వీయ చరిత్ర. వీరు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందారు.



Scanned with CamScanner

## జయగీతం

జయ జయ జయ అంబేడ్కర!
జయ దళిత జన స్వరా!
    జయ మానవ మందారా!
    జయభారత భాస్కరా! ॥ జయ ॥
నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా!
    భువి సమస్త పీడిత జన
    దుఃఖశాంతి తథాగతా! ॥ జయ ॥
వేదాలను శోధించి
వేదాంతము నధిగమించి
    మనిషి మనిషిగా బ్రతుకుటె
    మహితమన్న మహాశయా ॥ ॥ జయ ॥
అస్పృశ్యత రూపుమాపి
అగ్ర అంత్య భేదముడిపి!
    నిష్కల భారత జాతికి
    నీడయైన బోధిప్రియ ॥ ॥ జయ ॥
జాతీయ సమైక్యానికి
మతాతీత రాజ్యానికి






Scanned with CamScanner

ప్రజాస్వామ్య ధర్మానికి
ప్రాణమైన సంఘర్షీ! ॥ జయ ॥

జగతికి స్వేచ్ఛా సమతా
సౌభ్రాత్రములను కూర్పగ
జన్మమెల్ల పోరాడిన
జనగణ విప్లవ యోద్ధా! ॥ జయ ॥

అంధకాలమున పుట్టి
అవనికి దీపము పెట్టి
పంకమును మథించి మహికి
పరిమళ మొసగిన సూరీ! ॥ జయ ॥

రాళ్ళకు జీవము పోసి
మ్రోళ్ళను చిగురింప జేసి,
మట్టినుండి మానవులను
మలచిన కారణజన్మా! ॥ జయ ॥



## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| భాస్కరా! | = | సూర్యుడా! | అస్పృశ్యత | = | అంటరానితనం |
| సంవిధానం | = | రాజ్యాంగం | అంత్య | = | చివర |
| తథాగతా! | = | బుద్ధుడా! | ఉడిపి | = | తొలగించి |
| వేదాంతము | = | ఉపనిషత్తులు | సౌభ్రాత్రం | = | సోదరభావం |
| మథించి | = | చిలికి | పంకం | = | బురద / మట్టి |
| జగతి | = | లోకం | మ్రోళ్ళు | = | ఆకులు రాలిన చెట్లు |
| శోధించి | = | పరిశీలించి | సంఘర్షణ | = | మథనపడు |
| మహితము | = | గొప్పతనము | నిష్కుల | = | కులము లేని |

## ఇవి చేయండి



### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
2. నవభారత సంవిధాన నిర్మాత ఎవరు?
3. గేయ సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పండి?



### చదవడం - వ్యక్తపరచడం

**అ) గేయం ఆధారంగా ప్రాస పదాలు గుర్తించండి, రాయండి.**

................... ................... ...................

................... ................... ...................

**ఆ) కింది సంభాషణ చదవండి.**

మోహన్ : నమస్కారం గురువుగారూ!

ఉపాధ్యాయుడు : నమస్కారం! ఎవరూ!

మోహన్ : నేను గురువుగారూ! మీ శిష్యుడు మోహన్‌ని.

ఉపాధ్యాయుడు : మోహన్! ఎంత పెద్దవాడవయ్యావ్! ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. గుర్తు పట్టలేకపోయాను. ఇప్పుడేం చేస్తున్నావ్?



Scanned with CamScanner

అమ్మ : అయ్యా! మీ చలువ వల్ల మోహన్ చదువుకుని ఐడిపంతులైనాడు. రేపే బడిలో చేరాలి. మీ దగ్గర ఆశీర్వాదం తీసుకుందామని వచ్చాం.

ఉపాధ్యాయుడు : నా చలువేముందమ్మా! నీ బిడ్డను చదివించావు. అందుకే ప్రయోజకుడైనాడు.

అమ్మ : ఆ రోజు చదువుకుంటే ఏమొస్తదిలే అనుకొని, మోహన్‌ని చేపల వేటకు తీసుకువెళ్ళేవాళ్ళం.

ఉపాధ్యాయుడు : అవును! మోహన్ బడికి రాకపోతే నా మనసు ఊరుకునేది కాదు.



అమ్మ : అవునయ్యా! మీరు మాయింటికి ఎన్ని సార్లు వచ్చేవారో! ఎంతగా బతిమలాడేవారో! నేనే బడికి పంపేదాన్నికాదు. పైగా విసుక్కొనేదాన్ని. నా మనసు మార్చి బడికి పంపేలా చేసారు. మీరే లేకుంటే నా బిడ్డ ఎందుకూ పనికిరాకుండా పోయేవాడు.

మోహన్ : అవును! గురువుగారూ! ఆరోజు మీరు చేసిన పని వల్ల నా జీవితం మారిపోయింది. నాలాగా బడి మానేసిన పిల్లలు ఎంతో మంది ఉన్నారు. నేను కూడా అలాంటి పిల్లల కోసం పని చేస్తాను. నన్ను ఆశీర్వదించండి.

ఉపాధ్యాయుడు : నాకు చాలా గర్వంగా ఉంది మోహన్. నీ ఆశయం చాలా గొప్పది. మిగిలిన పిల్లలకు కూడా నువ్వు ప్రేరణ కావాలి. నీకు శుభం కలుగుగాక! వెళ్ళిరా నాయనా!

**కింది వాక్యాలు చదవండి. సంభాషణ ఆధారంగా ఎవరు ఎవరితో అన్నారో రాయండి.**

1. నేను గురువుగారూ!

జ. ....................................................................................

2. చేపల వేటకు తీసుకువెళ్ళేవాళ్ళం.

జ. ....................................................................................

3. గుర్తు పట్టలేక పోయాను.

జ. ....................................................................................

4. మాయింటికి ఎన్నిసార్లు వచ్చేవారో!

జ. ....................................................................................

5. మిగిలిన పిల్లలకు కూడా నువ్వే ప్రేరణ కావాలి.

జ. ....................................................................................



Scanned with CamScanner

(ఇ) కింది కవితను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

విద్యకొరకు కదలిరా!
ఆత్మగౌరవంతో కఠిన దీక్షతో
జ్ఞాన సంపదలు సేకరించుకో
విద్య లేనిదే జీవితం వృథా
ఆనంద జీవనం విద్యతోనే కదా!
సోమరిగా గడపవద్దు
విద్య కొరకు కదులు ముందు
మన బిడ్డలను చదివిద్దాం
బ్రతుకు చక్కదిద్దుకుందాం
సువర్ణావకాశ మొకటి
నీ ముందున్నది తెలుసుకో
విద్యకొరకు కదలిరా!



1. మనం జ్ఞానసంపదను ఎలా సేకరించుకోవాలి?

జ. ......................................................................................

2. మనం ఏవిధంగా గడపకూడదు?

జ. ......................................................................................

3. సువర్ణావకాశం అంటే ఏమిటి?

జ. ......................................................................................

4. ఈ కవిత దేని గురించి చెపుతున్నది?

జ. ......................................................................................



## పదజాలం

అ) గేయం చదవండి. కింది పదాలు - అర్థాలు జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1) | సంవిధానం | (     ) | అ) పండితుడు |
| 2) | తథాగతుడు | (     ) | ఆ) ఉపనిషత్తులు |
| 3) | వేదాంతము | (     ) | ఇ) వీరుడు |
| 4) | యోద్ధ | (     ) | ఈ) బుద్ధుడు |
| 5) | సూరి | (     ) | ఉ) రాజ్యాంగం |



Scanned with CamScanner

ఆ) కింది పదాలు చదవండి. పదాలకు సొంత వాక్యాలు రాయండి.

1) సూర్యుడు : ..............................................

2) భారతదేశం : ..............................................

3) జగతి : ..............................................

4) భూమి : ..............................................

5) పంకం : ..............................................

6) వేదాంతం : ..............................................

7) మ్రోళ్ళు/మోడు : ..............................................

8) అంత్య : ..............................................



## స్వీయరచన

1. ఎలా బతకడం గొప్ప విషయమని అంబేద్కర్ చెప్పాడు?
2. మీ తరగతి గదిలో చదువులో వెనుకబడిన విద్యార్థికి నీవు ఏవిధంగా సహాయం చేస్తావు?
3. భవిష్యత్తులో నీవు ఏమవ్వాలనుకుంటున్నావు? దానికి నీవు ఏంచేస్తావు?
4. అంబేద్కర్ గురించి రాయండి.



## సృజనాత్మకత

బాలకార్మిక నిర్మూలనకు నినాదాలు తయారు చేయండి.






## ప్రశంస

బాలు వాళ్ళ పక్కింటిలో ఒక ముసలమ్మ ఉంది. ఆమె ఒకరోజు జ్వరంతో లేవలేక మూల్గుతూ ఉంది. విషయం తెలుసుకున్న బాలు వాళ్ళ నాన్న సహాయంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళాడు.

**బాలుని నీవు ఎలా ప్రశంసిస్తావు?**



Scanned with CamScanner



## భాషాంశాలు

**అ) కింది పేరాను చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.**

నరసింహ సంగీత పాఠశాలకు వెళ్ళాడు. అక్కడ ఒక గదిలో చిన్న, పెద్ద వీణలు వరుసగా ఉన్నాయి. ఒక చోట పిల్లలు అందమైన నృత్యం చేస్తున్నారు. మరొక చోట చక్కని పిల్లన గ్రోవులు కనబడ్డాయి. ఇంకొక చోట పిల్లలు శ్రావ్యమైన పాటలు పాడుతున్నారు. మరొకచోట మృదంగం వాయిస్తున్నారు. నరసింహకు మంచి కచ్చేరీకి వెళ్ళిన అనుభూతి కలిగింది.

పై పేరాలో గీతలు గీసిన పదాలు నామవాచక గుణాలను తెలియచేసే పదాలు. ఇలా నామవాచక గుణాలను తెలిపే పదాలను **విశేషణాలు** అంటారు.



**ఆ) ఈ కింది వాక్యాలను చదవండి. సరైన విశేషణాలు రాయండి.**

(ప్రాచీన, నల్లని, ఎర్రని, కొత్త, శ్రావ్యమైన)

1. రాము .................. చొక్కా తొడుక్కున్నాడు.
2. ఆకాశం .................. మబ్బులతో ఉంది.
3. జయంతి .................. కలం కొన్నది.
4. తోలు బొమ్మలాట .................. కళారూపం.
5. స్వర్ణ .................. పాట పాడుతుంది.



**ఇ) కింది పేరాను చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.**

అమల ఉదయం నిద్ర లేచింది. కాలకృత్యాలు తీర్చుకున్నది. రాత్రి మిగిలిపోయిన ఇంటిపని పూర్తి చేసింది. అమ్మను అన్నం పెట్టమని అడిగింది. భోజనం చేసింది. పుస్తకాలు సర్దుకుంది. బడికి వెళ్ళింది.

పై పేరాలో గీతలు గీసిన పదాలు పనులను తెలిపేవి. ఇటువంటి పదాలను 'క్రియలు' అంటారు. ఈ కింది వాక్యాలను చదవండి. ఖాళీలను సరైన క్రియతో పూరించండి.

1. తాతయ్య కథ ..............................
2. అనూష పుస్తకం ..............................



Scanned with CamScanner

3. పుస్తకం బల్లపై ...............................

4. ఏనుగు చెరుకుగడ ...............................

5. రవి చిత్రాలు ...............................

**ఈ) కింది వాక్యాలు చదవండి. క్రియాపదానికి ముందు కూడా కొన్ని విశేషణాలు వస్తాయి. వీటిని క్రియా విశేషణాలు అంటారు.**

ఉదా : రాము పాట చక్కగా పాడాడు.

**కింది వాక్యాలలో క్రియాపదాల ముందు సరైన విశేషణ పదాన్ని చేర్చి రాయండి.**

**(గబగబ, వేగంగా, అందంగా, నెమ్మదిగా)**



1. నిషాంత్ .................. పరిగెడుతాడు.



2. సక్రు చెట్టుపైకి ............... ఎక్కాడు.



3. తేజు ............... నాట్యం చేస్తుంది.



4. గౌతమ్ .................. నడుస్తున్నాడు.



## ధారణ చేద్దాం

**ఎఱుక గలవారి చరితలు**
**గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం**
**బెఱుగుచు నెఱిగిన దానిని**
**మఱువ కనుష్ఠించునది సమంజస బుద్ధిన్**

భావం :- జ్ఞానవంతుల చరిత్రలు తెలుసుకోవాలి. మంచివారి సాంగత్యంతో ధర్మం గ్రహించాలి. తెలుసుకున్న ధర్మాన్ని మరవకుండా మంచి బుద్ధితో ఆచరించాలి.


\- నన్నయ



Scanned with CamScanner

G1H9M7

# చిక్కు ప్రశ్న - వివేకవంతమైన జవాబు



అనగనగా ఒక రాజు. ఆ రాజు గారు అరవై ఏళ్ళ ఉత్సవంలో ఒక ప్రకటన చేశారు. "రాబోయే పున్నమి రోజు నేనొక ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పిన వారికి వెయ్యి బంగారు కాసులు ఇస్తాను". ఇదీ రాజుగారి ప్రకటన.

పున్నమి రోజు రానే వచ్చింది. జనం తండోపతండాలుగా రాజధానికి చేరుకున్నారు. అందరూ రాజుగారు అడిగే ప్రశ్నల కోసం ఎదురు చూస్తున్నారు. రాజుగారు ఇలా చెప్పారు.

"మహారాణిగారికి గుత్తివంకాయకూర తినాలనిపించింది. వెంటనే వంటవాడిని పిలిచింది. "కూరలో మసాలా బాగా వెయ్యి, గుత్తివంకాయ కూర ఘుమఘుమలాడుతూ ఉండాలి" అని చెప్పింది. వంటవాడు రంగంలోకి దిగాడు. సన్నెకల్లు మీద మసాలా నూరుతున్నాడు. కూర వండక ముందే వాసన గుబాళించేస్తోంది.

వంటవాడి కూతురు ఉయ్యాలలో పడుకొని నిద్రలేచి ఏడుస్తోంది. పొయ్యి దగ్గర ఉన్న నీళ్ళ గంగాళం పట్టుకొని వంటవాడి కొడుకు ఆడుకొంటున్నాడు. ఆ నీళ్ళుపడి మంటలు ఆరుతున్నాయి. అది చూసిన వంటవాడికి ఎక్కడలేని కోపం వచ్చింది.

దీన్ని వంటవాడి భార్య చూసింది. "ఒరేయ్! నీకు పొయ్యిదగ్గర ఏం పనిరా? పొయ్యిలో పడ్డావంటే నీకు చావు మూడుతుంది". అని వాణ్ణి పట్టుకొని దూరంగా లాగింది. ఎలాగైతేనేం గుత్తివంకాయ కూర తయారైంది. దాన్ని తిని ఆ రుచికి మహారాణి మహదానంద పడిపోయింది. సంతోషం పట్టలేక ఆమె వంటవాణ్ణి పిలిచింది. కొన్ని బంగారు కాసులు బహుమానంగా ఇచ్చింది." అని కథ చెప్పడం ముగించారు. "కథ బాగా విన్నారుగా! రాణిగారు వంటవాడికి ఎన్ని బంగారు కాసులు ఇచ్చింది?

ఇదీ ప్రశ్న. సమాధానం కథలోనే ఉంది. ఎవరు జవాబు చెబుతారో చెప్పండి". అన్నాడు రాజు.

పండితులుందరూ తలలు గోక్కున్నారు. జవాబును మాత్రం ఒక్కరైనా ఊహించలేకపోతున్నారు. 5వ తరగతి చదివే వెన్నెల కూడా కథను బాగా విన్నది. "రాజుగారూ! నేను జవాబు చెబుతాను" అంటూ పెద్దగా అరిచి చేతులూపింది. జవాబు చెప్పమన్నాడు మహారాజు. మహారాజా! రాణిగారిచ్చిన కాసులు "వెయ్యి నూట పదహారు" అంది వెన్నెల. "శభాష్! చిన్నదానివైనా సరిగా చెప్పావు." అని దగ్గరకు తీసుకున్నాడు మహారాజు. సింహాసనం మీద కూర్చోపెట్టుకున్నాడు.

"పాపా జవాబు ఎలా చెప్పాగలిగావమ్మా?" అని వెన్నెలను అడిగాడు రాజుగారు "జవాబు మీ కథలోనే ఉంది మహారాజా! మసాలా వెయ్యిలో 'వెయ్యి' ఉంది. నూరుతున్నాడులో 'నూరు' ఉంది. ఏడుస్తోందిలో 'ఏడు' ఉంది. ఆరుతున్నాయిలో 'ఆరు' ఉంది. మూడుతుందిలో 'మూడు' ఉంది. మొత్తం కలిపితే 'వెయ్యి నూటపదహారు' అని జవాబు చెప్పింది వెన్నెల. జనం చప్పట్లతో వెన్నెలను అభినందించారు. రాజుగారు ప్రకటించిన బహుమతి వెన్నెలకే దక్కింది.

- జానపద కథ



Scanned with CamScanner

# 5. తోలు బొమ్మలాట - ఒక జానపద కళ

H3R3E2



చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.

1. చిత్రంలో ఏం జరుగుతున్నది?
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏమేం చేస్తున్నారు?
3. ఇలాంటి ప్రదర్శనలు మీరు ఇంకా ఏమేమి చూశారు?

**కవి పరిచయం**

ఈ పాఠానికి కె.వి. రామకృష్ణ రచించిన "తోలుబొమ్మలాట" వ్యాసం ఆధారం.

# తోలు బొమ్మలాట - ఒక జానపద కళ

**థాధిమి థకధిమి తోలు బొమ్మ**

**దీని తమాషా చూడరా మాయబొమ్మ**

పిల్లలూ! మీరు ఎప్పుడైనా తోలు బొమ్మలాట గురించి విన్నారా! అది మన ప్రాచీన జానపద కళ. ఎందరో గొప్పగొప్ప కళాకారులు వందల సంవత్సరాలుగా తోలు బొమ్మలాట కళకు జీవం పోశారు. మనం తోలు బొమ్మలాట గురించి తెలుసుకుందామా!


'తొంబై ఆమడలైనా వెళ్ళి తోలు బొమ్మలాట చూడాలి' అనే ప్రాచీన నానుడి వలన ఆనాటి గ్రామీణ జీవితాలలో తోలు బొమ్మలాట కెంత ప్రాముఖ్యం ఇచ్చారో తెలుస్తున్నది. తోలు బొమ్మలాట క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికే తెలుగు ప్రాంతంలో ప్రచారంలో ఉన్నట్టు తెలుస్తున్నది.

మన ఆంధ్రలో తూర్పుగోదావరి, వై.ఎస్.ఆర్. కడప, అనంతపురం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో తోలు బొమ్మలాట కళాకారులు ఉన్నారు. మహారాష్ట్ర నుండి వలస వచ్చిన ఆరె కులస్థుల నుండి ఈ తోలు బొమ్మలాట ఇతర కులస్థులు నేర్చుకున్నారు.





Scanned with CamScanner



తోలు బొమ్మల తయారీలో జంతు చర్మాలను ఉపయోగిస్తారు. ఇవి అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటాయి. తోలు బొమ్మలు ఒక అడుగు నుండి నాలుగైదు అడుగుల ఎత్తు వరకు తయారు చేసుకుంటారు.

ప్రకృతి పరంగా దొరికే మోదుగ పువ్వు, బంక, దీపపు మసి వంటి సహజ సిద్ధమైన రంగులను తోలుబొమ్మలకు వాడడం వల్ల వాటికి ఎటువంటి హాని జరగకుండా ఉంటుంది. బొమ్మలను తెరమీద ఆడించటానికి అనుకూలంగా వెదురుబద్దను బొమ్మ మధ్య భాగంలో కడతారు. బొమ్మను ఆడించటానికి ఈ వెదురు బద్దే ఆధారంగా ఉంటుంది.

మూడువైపుల మూసి ఉన్న పందిరి వేసి, ముందువైపు తెర లాగ పల్చటి తెల్లని బట్ట కడతారు. ప్రదర్శనకు ఆరు నుంచి ఎనిమిది మంది కళాకారులు ఉంటారు. కథలో స్త్రీ పాత్ర వచ్చినపుడు స్త్రీలు, పురుష పాత్ర వచ్చినపుడు పురుషులే పాట పాడుతారు. వంతలు హార్మోనియం, మద్దెల, తాళాలు వాయిస్తూ వంతపాడతారు.

తోలు బొమ్మలాటలో చెప్పే భాగవత కథల్లో ఎక్కువగా భక్త ప్రహ్లాద, సావిత్రి, కృష్ణలీలలు మొదలైనవి మూడు రోజుల పాటు ప్రదర్శిస్తారు. రామాయణ, భారత, భాగవత కథా వస్తువులతో పాటు సమాజానికి అవసరమైన వేమన, సుమతి, నీతి శతకాలలోని పద్యాలను, శ్లోకాలను, సూక్తులను, నీతి వాక్యాలను, సామెతలను సందర్భానుసారంగా ఉపయోగిస్తారు.



Scanned with CamScanner



కథ ప్రారంభానికి ముందుగా గణపతికి ప్రార్థన చేస్తారు. తోలు బొమ్మలాటలో ప్రదర్శన నాట రాగంతో ప్రారంభించి, సురభి రాగంతో ముగిస్తారు.

పిల్లలూ! తోలు బొమ్మలాటలో ముఖ్యంగా పిల్లలను, ఇతర సామాన్య జనాన్ని నవ్వించే రెండు హాస్య పాత్రలు ఉంటాయి. అవి కేతిగాడు, బంగారక్క, కేతిగాడినే 'జుట్టు పోలిగాడు' అని కూడా అంటారు. వీరు ప్రదర్శన మధ్యలో ప్రత్యక్షమై, చమత్కారంగా మాట్లాడుతూ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంటారు.

ఈ కళాకారుల కుటుంబాలలో చిన్నప్పటి నుంచీ పిల్లలకు ఈ కళపై శిక్షణను ఇస్తారు. తోలు బొమ్మలు తయారు చేయడం వాటిని ఆడించడం, పద్యాలు, పాటల గానం, సంభాషణలు పలికే తీరు తదితర అంశాలపై తర్ఫీదునిస్తారు. తోలు బొమ్మలాటలో ప్రదర్శించే కథలు, గాథలు, పుస్తక రూపంలో ఉండవు. కనుకనే పిల్లలు వీటిని ముఖతః పారాయణం (ఒకరు చెపుతుంటే విని నేర్చుకోవడం) చేస్తారు. ఇందుకు వారికి మంచి జ్ఞాపకశక్తి కావాలి. ప్రదర్శనా నైపుణ్యం కూడా కావాలి. ఏ కళారూపమైనా రక్తి కట్టేది కళాకారుని నైపుణ్యంతోనే!

కళల ద్వారా మానవనాగరికత ప్రతిబింబిస్తుంది. జానపద కళలు ఒకతరం నుంచి మరొక తరానికి శ్రుత పాండిత్యంతో ప్రవహిస్తూ ఉంటాయి. ఈ కళలు కాలగర్భంలో కలిసిపోకుండా కొందరు పరిశోధకులు గ్రంథస్థం కూడా చేస్తున్నారు. పగటి వేషాలు, కోలాటాలు, బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథలు వంటి ఎన్నో జానపదకళలను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిది.

సంస్కృతిని కాపాడుకోవడం మన కర్తవ్యం. కాబట్టి పిల్లలూ ... వివిధ జానపద కళారూపాల పాటలు, నృత్యాలు నేర్చుకుని, ప్రదర్శించి, కళలను ఆదరిద్దాం.



Scanned with CamScanner

## పదాలు-అర్థాలు

| | | | |
|---|---|---|---|
| ప్రాచీన | = పాత, పురాతన | తర్ఫీదు | = శిక్షణ, అభ్యాసం |
| ప్రాముఖ్యం | = ప్రాధాన్యం | రక్తి కట్టడం | = అలరించడం |
| ఆమడ | = ఎనిమిదిమైళ్ళ దూరం | శ్రుత పాండిత్యం | = వినడం ద్వారా నేర్చుకోవడం |
| శతాబ్దం | = వంద సంవత్సరాలు | చమత్కారం | = నేర్పు |
| నానుడి | = వాడుకగా అనే మాట, సామెత | పారాయణం | = శ్రద్ధగా చదవడం |

## ఇవి చేయండి



### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. జానపదకళల్లో తోలుబొమ్మలాట గురించి తెలుసుకున్నావు కదా? నీకేమనిపించింది?
2. మీ ఊరి జాతరలో, పండుగలలో మీరు చూసిన జానపదకళల గురించి చెప్పండి.
3. పాఠంలో మీకు నచ్చిన అంశం ఏమిటి? తోలుబొమ్మల్లా మీరు ఏయే బొమ్మలు తయారు చేస్తారు?



### చదవడం - వ్యక్తపరచడం

**అ) పాఠం చదవండి. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. తోలుబొమ్మలాట ఏయే జిల్లాలలో ప్రదర్శిస్తారు?

   జ. ..........................................................

2. తోలుబొమ్మల తయారీలో వాడే రంగులు ఏవి?

   జ. ..........................................................

3. తోలు బొమ్మలాటలో నవ్వించే పాత్రలు ఏవి?

   జ. ..........................................................



**ఆ) కింది జానపదకళ గురించి చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

**తప్పెటగుండ్లు** : జానపద కళారూపాలలో ఒకటైన తప్పెటగుండ్లు ప్రత్యేకించి ఉత్తరాంధ్రాలో ఎక్కువగా కనిపిస్తుంది. గుండ్రంగా రేకుతో చేసిన తప్పెట్లను ఈ బృందం కళాకారులు మెడలో వేసుకుని పాడుతూ ఆ పాటకు అనుగుణంగా గుండ్రంగా తిరుగుతూ నాట్యం చేస్తారు. పాటకు అనుగుణంగా తప్పెట్లను వాయిస్తుంటారు. ఈ వాయిద్యాల్ని, గుండెమీద పెట్టుకుని వాయించడం కారణంగా దానికి తప్పెట 'గుండ్లు' అనే పేరు వచ్చినట్లు తెలుస్తోంది.



Scanned with CamScanner

యాదవులు ఈ తప్పెట గుండ్లను ప్రదర్శించేవాళ్ళు.

1) తప్పెటగుండ్లు ఏ ప్రాంతానికి చెందింది?

జ.

2) తప్పెటగుండ్లు అనే పేరు ఎలా వచ్చింది?

జ.

3) తప్పెట గుండ్లను ఎవరు ప్రదర్శించేవారు?

జ.



ఇ) కింది జానపదకళ గురించి చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.

**కోలాటం :** గ్రామీణ ప్రాంత ప్రజలు తాము చేసే నిత్యకృత్యాలలోని అలసటను మరచిపోయేందుకు ఉపయోగించే కళారూపం కోలాటం. కోలాటం ఆటలో కళాకారులు రెండు చేతులలో కోలలు ధరించి వాటిని తాడిస్తూ కోలాటం ఆడుతారు. ఇందులో ఏకకోలాటం, జంట కోలాటం, జడ కోలాటం, స్త్రీల కోలాటం, పురుషుల కోలాటం లాంటివి ఎన్నో ఉన్నాయి. కోలాటం నృత్యంలో సుమారు 16 మంది నుండి 40 మంది వరకు పాల్గొనవచ్చు.

1) ..................................................................

2) ..................................................................

3) ..................................................................

4) ..................................................................





## పదజాలం

అ) కింది జానపద కళల పేర్లు చదవండి. వాటిలో మీ ప్రాంతపు జానపదకళలను గుర్తించి '◯' చుట్టండి.

| | | | | |
|---|---|---|---|---|
| కోలాటం | ఒగ్గుకథ | హరికథ | బుర్రకథ | గుస్సాడి |
| తప్పెటగుండ్లు | భారతం | డప్పు | థింసా | గంగిరెద్దులు |
| పగటివేషం | పులివేషం | సేవగరిడీ | పిట్టలదొర | సాముగరిడీ |

ఆ) "తొంభై ఆమడలైనా వెళ్ళి తోలుబొమ్మలాట చూడాలి" అనేది ఒక నానుడి. నానుడులు సామెతలు లాగే జనుల నోట పుట్టాయి. కింది సామెతలు చూడండి. వాటి అర్థాలు తెలుసుకోండి.

సామెత : ఆరునెలలు సహవాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారంట

అర్థం : ఎవరితోనైనా ఆరు నెలలు కలిసి వుంటే వారి లక్షణాలు మనకు కొన్ని అబ్బుతాయి. మంచి వాళ్ళతో వుంటే మంచి లక్షణాలు, చెడ్డ వారితో ఉంటే చెడు లక్షణాలు కలుగుతాయని అర్థం.



Scanned with CamScanner

సామెత : రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరచినట్లు

అర్థం : ..............................................................................................

సామెత : ఆవులిస్తే పేగులు లెక్కపెట్టినట్లు

అర్థం : ..............................................................................................

ఇ) **కింది సామెతలను సరైన పదంతో పూరించండి.**



ఉదా : ............ పిల్ల ............ కి ముద్దు.

కాకి పిల్ల కాకికి ముద్దు.

1. ................ కాటుకు ................ దెబ్బ.
2. ................ వంగనిది ................ వంగునా?
3. అదిగో ................ అంటే ఇదిగో ................ అన్నట్లు.
4. ఇంట్లో ................ మోత, బయట ................ మోత.
5. ................ మంచిదైతే ................ మంచిది.

ఈ) **పాఠం చదవండి. అందులో కొన్ని పదాలకు మీ ప్రాంతాలలో వేరు పదాలు వాడుతుండవచ్చు. అలాంటి పదాలను గుర్తించి రాయండి.**

ఉదా :- ఎటువంటి - ఎలాంటి

1. ............................ 2. ............................

3. ............................ 4. ............................



## స్వీయరచన

1. తోలుబొమ్మల తయారీలో రంగుల కోసం ఏమేమి ఉపయోగిస్తారు?
2. కళాకారుల పిల్లలకు తోలుబొమ్మలాట కళలో ఏయే అంశాలలో శిక్షణ నిస్తారు?
3. తోలుబొమ్మలాటకు కథా వస్తువులుగా వేటిని తీసుకుంటారు?
4. తోలుబొమ్మలాట గురించి ఐదు వాక్యాలు రాయండి.





## సృజనాత్మకత

తోలు బొమ్మల్లాగే మనం గుడ్డతో బొమ్మలు, కాగితంతో బొమ్మలు తయారు చేసుకోవచ్చును. ఇక్కడ వేలికి తొడిగే కాగితపు బొమ్మలను చూడండి. ఇలాంటివి తయారు చేద్దామా? అయితే కాగితాలు తీసుకోండి. మీరు బొమ్మలు తయారు చేయండి. వాటిని ఉపయోగించి ఒక కథను చెప్పండి.



Scanned with CamScanner



## ప్రశంస

జానపద కళలను ప్రదర్శించే కళాకారులను మీరు ఏవిధంగా గౌరవిస్తారు? ఏవిధంగా ప్రశంసిస్తారో చెప్పండి.




## ప్రాజెక్టు పని

జానపద కళలకు సంబంధించిన వివిధ చిత్రాలను, పాటలను సేకరించండి. తరగతిలో ప్రదర్శించండి.



## భాషాంశాలు



అ) కింది వాక్యాలను చదవండి.

1. వాల్మీకి రామాయణాన్ని రచించాడు.
2. దశరథుడు అయోధ్యను పాలించాడు.
3. సంఘ సంస్కర్తలు దురాచారాలను నిర్మూలించారు.
4. నవీన్ 'ఎలుకవీరుడు' కథ చదువుతున్నాడు.

పై వాక్యాలకు సంబంధించిన ప్రశ్నార్థక వాక్యాలను చదవండి.

1. రామాయణాన్ని ఎవరు రచించారు?
2. అయోధ్యను ఎవరు పాలించారు?
3. దురాచారాలను ఎవరు నిర్మూలించారు?
4. ఎలుకవీరుడు కథను ఎవరు చదివారు?

ఆ) పిల్లలూ! పై వాక్యాలలో ఏ ప్రశ్నార్థక పదం ఉన్నదో గమనించండి. ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలేవో చెప్పండి. ఇలా "ఎవరు" అనే పదానికి సమాధానంగా వచ్చే వాటిని "కర్త" అంటారు.

కింది ప్రశ్నలను చదవండి.



1. వాల్మీకి దేన్ని రచించాడు?
2. దశరథుడు దేన్ని పాలించాడు?
3. సంఘ సంస్కర్తలు వేటిని నిర్మూలించారు?
4. నవీన్ ఏ కథను చదివాడు?



Scanned with CamScanner

ఇ) ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు ఏవో చెప్పండి. మీరు చెప్పిన మాటలను అంటే ఎవరిని, దేనిని, వేటిని అనే పదాలకు సమాధానంగా వచ్చే పదాలను 'కర్మ' అంటారు.

ఈ) పై వాక్యాలలో ఒక పని జరగటాన్ని తెలియచేసే పదాలను క్రియలంటారని మీకు తెలుసుకదా!

ఉ) కింది వాక్యాలను చదవండి. కర్త, కర్మ, క్రియలను గుర్తించి రాయండి.



1. తాబేలు కుందేలును ఓడించింది.
2. సుబ్బు బొమ్మలు గీశాడు.
3. మేరి పాట పాడింది.
4. గాంధీ మనకు స్వాతంత్ర్యం సాధించాడు.
5. శ్రీకృష్ణదేవరాయలు విజయనగరాన్ని పాలించాడు.

ఊ) క్రియలు ప్రధానంగా రెండు రకాలు. 1. సమాపక క్రియ , 2. అసమాపక క్రియ. ఒక క్రియా పదం వాక్యాన్ని పూర్తి చేస్తే అది 'సమాపక క్రియ'.

ఉదా : సలీం పాఠం చదివాడు.

ఒక క్రియా పదం వాక్యాన్ని పూర్తి చేయలేకపోతే అది 'అసమాపక క్రియ'.

ఉదా : సలీం పాఠం చదివి ...

ఇలాంటి వాక్యాలు మీ ముందు పాఠాలలో ఉన్నాయి. గుర్తించి రాయండి.

| సమాపక క్రియా వాక్యం | అసమాపక క్రియా వాక్యం |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |



## ధారణ చేద్దాం

విద్య వలనను వినయంబు, వినయమునను
బడయు పాత్రత, పాత్రత వలన ధనము,
ధనము వలనను ధర్మంబు, దాని వలన
ఐహికాముష్మిక సుఖంబు లందు నరుడు

భావం :- మానవుడు విద్యవల్ల వినయాన్ని పొందుతాడు. వినయం వల్ల అర్హత వస్తుంది. అర్హత ధనాన్ని చేకూరుస్తుంది. ఆ ధనం ఉంటే ధర్మం చేయవచ్చు. ధర్మ గుణం వల్ల ఈ లోకంలోనూ, తరువాత పరలోకంలోనూ సుఖాలు పొందుతాడు.

– భర్తృహరి సుభాషితం



Scanned with CamScanner





# కూచిపూడి నృత్యం-ఒక సంప్రదాయ కళ

H5U5S8

కూచిపూడి నృత్యం తెలుగువారి ప్రత్యేక నృత్యరీతి. ఇది ఆంధ్రరాష్ట్రంలో కృష్ణాజిల్లాలోని దివిసీమలో 'కూచిపూడి' అనే గ్రామంలో కొన్ని శతాబ్దాల పూర్వం ఆవిర్భవించిన కళారూపం. ఈ ఊరిపేరుతోనే ఇది ప్రసిద్ధమైంది.

సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళకు మూలపురుషుడు అంటారు. ఆయన నాడు ప్రచారంలో ఉన్న యక్షగానాది కళారూపాలను స్వీకరించి కూచిపూడి నృత్య ప్రక్రియను అభివృద్ధి చేశాడు. ఈయన రచించిన నాట్య నాటకం 'భామా కలాపం'. తెలుగులో ఇది మొట్టమొదటి నృత్య నాటకం. కూచిపూడి నాట్యకళాకారులు విస్తృతంగా ప్రదర్శించే నాటకమిది.



నాట్యం అభినయప్రధానం. అభినయం నాలుగు రకాలు. అవయవాల కదలికతో భావవ్యక్తీకరణ ఆంగికాభినయం. భాష ద్వారా వ్యక్తీకరణ వాచికాభినయం. వేషం ద్వారా భావవ్యక్తీకరణ ఆహార్యాభినయం. శరీరంలో కలిగే మార్పుల ద్వారా భావవ్యక్తీకరణ సాత్వికాభినయం.

కూచిపూడి కళాకారులు తమ నృత్య నాటకాలతో పాటు పగటి వేషాలు కూడా వేస్తారు. వాళ్లు వేసే పగటి వేషాల్లో ప్రధానమైనది అర్ధనారీశ్వరవేషం. అర్ధనారీశ్వర వేషంలో కుడివైపు పురుషుడు, ఎడమవైపు స్త్రీ ఉంటారు. ఈ రెండు వేషాలను వేరుచేస్తూ పై నుండి క్రింది వరకు ఒక తెర ఉంటుంది. ఒక వేషం మాట్లాడేటప్పుడు రెండోవైపును తెర కప్పుతుంది.

జనానికి వినోదం కలిగించడం, వారిని నాటకంవైపు ఆకర్షించడం ఈ పగటి వేషాల ప్రయోజనం. ఈ వేషాల ద్వారా సాంఘిక దురాచారాలను విమర్శించడం కూడా ఉంది.

కూచిపూడి నాటక ప్రదర్శనలను 'భాగవత మేళా' అని కూడా అంటారు. వీటిల్లో స్త్రీ పురుష పాత్రలు రెండూ ఉంటాయి. కాని ఇటీవలి వరకు స్త్రీ పాత్రను కూడా పురుషులే ధరించేవారు. ఇప్పుడు స్త్రీలు కూడా ధరిస్తున్నారు.


కీ.శే. భాగవతుల రామయ్య, హరిమాధవయ్య, చింతా వెంకట రామయ్య, తాడేపల్లి పేరయ్య, భాగవతుల విస్సయ్య, వెంపటి వెంకట నారాయణ, దర్భా వెంకటేశ్వర్లు, వేదాంతం పార్వతీశం, వేదాంతం వెంకటాచలపతి, వేదాంతం రామకృష్ణయ్య, వేదాంతం రాఘవయ్య, చింతా కృష్ణమూర్తి, వేణుగోపాలకృష్ణశర్మ, వేదాంతం రత్తయ్యశర్మ, వేదాంతం సీతారామశాస్త్రి మొదలయినవారు కూచిపూడి నాట్యాన్ని విశ్వవ్యాప్తం చేశారు.



Scanned with CamScanner

X1L7N3

# 6. పెన్నేటిపాట



**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో మీకు ఏమేమి కనిపిస్తున్నాయి?
2. చిత్రంలో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారు?



## కవి పరిచయం

### విద్వాన్ విశ్వం (21-10-1915 - 19-10-1987)



విద్వాన్ విశ్వం కవి, కథకుడు. సంస్కృత కావ్యాలను తెలుగు వచనంలోకి అనువదించారు. 'పెన్నేటి పాట', 'విలాసిని', 'రాతలు-గీతలు' మొదలయినవి వీరి రచనల్లో కొన్ని. రాయలసీమ సౌందర్యాన్ని, విషాదాన్ని సమంగా చిత్రించిన 'పెన్నేటి పాట' నుండి ఈ ఖండికను తీసుకున్నాం.



Scanned with CamScanner

# పెన్నేటిపాట

కోటి గొంతుల
కిన్నెర మీటుకొనుచు
కోటి గుండెల
కంజర కొట్టుకొనుచు
వినిపింతునింక
నేటి రాయలసీమ పెన్నేటిపాట

ఏదీ పెన్న! ఏదీ పెన్న!
ఏదీ పినాకినీ ?
ఇదే పెన్న! ఇదే పెన్న!
ఇదే పినాకినీ!

ఏదీ నీరు? ఏదీ హెూరు?
ఏదీ నీటి జాలు ?
ఇదే నీరు! ఇదే హెూరు!
ఇదే ఇసుక వాలు!



అదే పెన్న! అదే పెన్న!
నిదానించి నడు!
విదారించు నెదన్, వట్టి
ఎడారి తమ్ముడు!

కుండపోతల వానలు
గురియ నేమి?
పట్టుమని పదినాళ్ళలో
పారబోసి,
ఇసుక దొక్కసమున
మిగులెల్ల దాచి,
పెన్న పండుకొను
నీ నేల దిన్నెమీద!

ఈ ఏటి నీటిలో
బ్రహ్మదనము లూరుచుండు
దోసిట నొక్కమారు
పుక్కిలించిన చాలు

నీ పుట్టువునకు, సార్థకత్వమ్ము
నిష్కల్మషత్వ మబ్బు!
ఇంతమంది కన్నతల్లి
ఎందుకిట్లు మారెనో?
ఇంతమంచి పెన్నతల్లి
ఎందుకెండి పోయెనో?



## పదాలు - అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| హోరు | = | శబ్దం | ఎద | = | హృదయం |
| నిదానించు | = | నెమ్మదిగా | బొక్కసం | = | ధనాగారం |
| జాలు | = | ప్రవాహం | నాళ్లు | = | రోజులు, ప్రాంతాలు |
| విదారించు | = | చీల్చుకుంటూ | కంజర | = | ఒక రకమైన వాయిద్యం |

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. పాటను రాగయుక్తంగా పాడండి.
2. పాట భావం సొంత మాటల్లో చెప్పండి.
3. మీకు తెలిసిన నది / సెలయేరు / చెరువు / కాలువల గురించి మాట్లాడండి.

### చదవడం - వ్యక్తపరచడం

**అ) గేయం ఆధారంగా ప్రాస పదాలు గుర్తించండి, రాయండి.**

................ ................ ................ ................

................ ................ ................ ................

**ఆ) పేరాను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రవహిస్తున్న నదులలో "నాగావళి" ముఖ్యమైన నది. ఇది ఒడిశా రాష్ట్రంలో ప్రారంభమవుతుంది. నాగావళి నది మీద తోటపల్లి, నారాయణపురం వద్ద నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించారు. శ్రీకాకుళం దగ్గరలోని కళ్ళేపల్లి వద్ద నాగావళి బంగాళాఖాతంలో కలుస్తుంది. శ్రీకాకుళం పట్టణ ప్రజలకు ఈ నది ద్వారా తాగునీటి అవసరాలు తీరుతాయి.

1. నాగావళి నది ఏ ప్రాంతానికి చెందినది?

   జ. ..............................................................................

2. నాగావళి నది ఎక్కడ బంగాళాఖాతంలో కలుస్తుంది?

   జ. ..............................................................................

3. నదుల వలన మనకు కలిగే ఉపయోగమేమిటి?

   జ. ..............................................................................






Scanned with CamScanner

ఇ) కింది లేఖను చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.

పత్రికా సంపాదకులకు, గూటాల,

నమస్కారములు! తేది : 03.01.2020



మా ఊరు అడవికి దగ్గరగా ఉంటుంది. పక్కనే గోదావరి నది. ఈ మధ్య రహదారుల విస్తరణ కోసమని పెద్ద పెద్ద చెట్లను నరికేసారు. గోదావరిలో నానా చెత్తా చెదారం వేసి కలుషితం చేస్తున్నారు. ఇలా విచక్షణ లేకుండా పర్యావరణాన్ని పాడుచేస్తే భవిష్యత్ తరాలకు తాగడానికి స్వచ్ఛమైన నీరు దొరకదు. పీల్చడానికి స్వచ్ఛమైన గాలి ఉండదు. అడవులు, నదుల రక్షణ మన జీవన విధానంలో భాగం కావాలి. దీనికి అందరూ బాధ్యత వహించాలి. దీన్ని పత్రికా ముఖంగా ప్రజలకు తెలియజేయ వలసినదిగా కోరుతున్నాను.

కృతజ్ఞతలతో

ఇట్లు

అభిరామ్

1. ...............................................................................

2. ...............................................................................

3. ...............................................................................



## పదజాలం

అ) కింది గేయ వాక్యాలు చదవండి.

ఏదీ కృష్ణ? ఏదీ కృష్ణ? ఏదీ కృష్ణవేణి?
ఇదే కృష్ణ! ఇదే కృష్ణ! ఇదే కృష్ణవేణి!

కృష్ణను కృష్ణవేణి అని అంటారు. ఇలాగే గోదావరిని గౌతమి అని, గంగను భాగీరథి అని కూడా అంటారు. వీటిని ఉపయోగించి మీరు గేయ వాక్యాలు రాయండి.

...............................................................................

...............................................................................


...............................................................................

...............................................................................



Scanned with CamScanner

## స్వీయరచన



అ) కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. కవి పెన్నా పూర్వవైభవం గురించి ఏమని ప్రశ్నించాడు?
2. పెన్నా నీటిని కవి ఎలా వర్ణించాడు?
3. నదులలో నీళ్ళు లేకపోతే ఏమౌతుంది?

## సృజనాత్మకత

అ) కింది గోడపత్రికను చదవండి.

### గ్రామ ప్రజలకు విజ్ఞప్తి

**గ్రామ ప్రజలారా! జాగ్రత్త పడండి. నీటిని పొదుపుగా వాడండి.**
**నీటి వృథాను అరికట్టండి.**



- నీరు మన ప్రాణాధారం.
- ప్రతి నీటిచుక్కా విలువైనదే.
- నీటిని పొదుపుగా వాడుకుందాం.
- మన అవసరం మేరకు మాత్రమే నీటిని వినియోగిద్దాం.
- నీరు ఎక్కడైనా పంపుల ద్వారా, కుళాయిల ద్వారా వృథా అవుతుంటే వెంటనే మునిసిపాలిటీ/ పంచాయితీ వారికి తెలియజేయండి.
- కుళాయి నీరు వదిలేసి పనులు చేయకండి. బకెట్‌లో పట్టుకొని నీటిని వాడండి.
- వాడుకున్న నీటిని మొక్కలకు మళ్లించండి.

గ్రామపంచాయితీ
రావులపాలెం

అ) ఇదే విధంగా నేడు ప్లాస్టిక్ సంచుల వల్ల కాలుష్యం పెరుగుతుంది. దానికి బదులుగా కాగితం, జనపనార సంచుల వినియోగపు అవసరాన్ని తెలియచేస్తూ గోడ పత్రికను తయారు చేయండి.

## ప్రశంస

మీ స్నేహితులు పాఠశాల కుళాయిల్లో నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుతుంటే వారిని మీరు ఎలా ప్రశంసిస్తారు?



Scanned with CamScanner

## భాషాంశాలు



అ) **కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలను గమనించండి.**

చందన్ కథల పుస్తకం చదివాడు.

చందన్ కథల పుస్తకం చదువుతున్నాడు.

చందన్ కథల పుస్తకం చదువుతాడు.

పై వాక్యాలలోని మొదటివాక్యంలో 'చదివాడు' అనే పదం జరిగిపోయిన పనిని సూచించే క్రియా పదం.
రెండవ వాక్యంలో 'చదువుతున్నాడు' అనే పదం జరుగుతున్న పనిని సూచించే క్రియాపదం.
మూడవ వాక్యంలో 'చదువుతాడు' అనే పదం జరగబోయే పనిని సూచించే క్రియా పదం.
అంటే వాక్యాలలో కాలాలను బట్టి 'క్రియాపదాల రూపాలు' మారుతూ ఉంటాయి.
క్రియా పదాలను వాక్యంలో వాడినప్పుడు అవి పై వాక్యాలలో వలె కాలాలను తెలుపుతూ ఉంటాయి.
కాలాలను మూడు విధాలుగా విభజించవచ్చు.

అవి :

| | | |
|---|---|---|
| జరిగిపోయిన కాలం | : | దీన్ని **భూతకాలం** అంటారు. |
| జరుగుతున్న కాలం | : | దీన్ని **వర్తమాన కాలం** అంటారు. |
| జరగబోయే కాలం | : | దీన్ని **భవిష్యత్ కాలం** అంటారు. |

ఆ) **ఇంతవరకు మీరు చదివిన పాఠాల ఆధారంగా కింది పట్టికను పూరించండి. వాటితో వాక్యాలు రాయండి.**

| భూతకాల పదాలు | వర్తమానకాల పదాలు | భవిష్యత్‌కాల పదాలు |
|---|---|---|
| | | |
| | | |

## ధారణ చేద్దాం

**సాధువులగు జంతువులకు**
**బాధలు గావించు ఖలుల భంజింపని రా**
**జాధము నాయుస్స్వర్గ**
**శ్రీధనములు వీగి పోవు సిద్ధము తల్లీ.**

భావం :– తల్లీ! సాధు జంతువులను బాధించి వేధించే దుర్మార్గులను రాజైనవాడు తప్పక శిక్షించాలి. ఆ విధంగా శిక్షించకుండా ఉపేక్షించిన అధముడైన రాజు జీవితం ఆయుష్షు, ఐశ్వర్యం అన్నీ వ్యర్థం అనేమాట నిజం.

– పోతన నీతి



Scanned with CamScanner



చదువుదాం

# మూడు చేపలు

J1F4Y4



ఒక మడుగులో మూడు చేపలు ఉన్నాయి. అందులో ఒకదాని పేరు దీర్ఘదర్శి. మరొకదాని పేరు ప్రాప్తకాలజ్ఞుడు. ఇంకొకదాని పేరు దీర్ఘసూత్రుడు. అవి ఆ మడుగులో సుఖంగా కాలం గడుపుతుంటే వేసవికాలం సమీపించింది. ఇది గమనించిన దీర్ఘదర్శి తక్కిన రెండిటితో "ఈ మడుగు చాలా చిన్నది. వేసవిలో ఎండిపోతుంది. కనుక ఎప్పుడూ ఎండిపోని పెద్ద మడుగులోకి వెళ్ళిపోదాం" అంది. ఇది విని ప్రాప్తకాజ్ఞుడు "వేసవి వస్తే ఈ మడుగు ఎండిపోతుందని ఎలా చెప్పగలం? ఒక వేళ ఎండిపోవడం నిజమైతే అప్పుడే ఏదో ఒక ఉపాయం తోచక పోతుందా? ఇప్పుడు ఈ మడుగు నిండుగా ఉంది. ఎప్పుడో కష్టం వస్తుందని ఇప్పుడు ఈ మడుగు విడిచివెళ్ళడం మంచిది కాదు" అంది.

ఇది విని దీర్ఘసూత్రుడు "మీ మాటలు చాలా తికమకగా ఉన్నాయి. ఈ మడుగు మహాసముద్రంవలె పెద్దది. అనవసరంగా భయపడుతున్నారు. కాబట్టి మనం ఇక్కడ నుండి కదలడం మంచిది కాదు" అంది. దీర్ఘదర్శికి ఈ మాటలు నచ్చలేదు. వేసవిలో ఇక్కడ ఉండడం అపాయకరమని అనుకుంది. దీర్ఘదర్శి వెంటనే మడుగులోకి నీరు వచ్చే పిల్లకాలువలో ప్రవేశించింది. అక్కడ నుండి పెద్ద కాలువలోకి, దానిలో నుండి సముద్రంలా ఉండే ఒక పెద్ద మడుగులోకి ప్రవేశించింది. అక్కడ నిశ్చింతగా గడపసాగింది.

ఇంతలోనే వేసవి కాలం రానే వచ్చింది. ఒక్కొక్క చెరువు ఎండిపోసాగింది. మరికొన్ని రోజులకు మడుగు దగ్గరికి వలలు పట్టుకుని జాలరులు వచ్చారు. చేపలన్నీ తప్పించుకోవడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జాలర్లకు దొరికిపోయాయి. దొరికిన చేపలన్నిటినీ వారు ఒక తాడుకు గుచ్చసాగారు. అది చూచి ప్రాప్తకాలజ్ఞుడు "అయ్యో! పెద్ద చిక్కు వచ్చింది. ఇప్పుడు బాధపడుతూ కూర్చోక ఏదైనా ఉపాయం ఆలోచించాలి" అని తీవ్రంగా ఆలోచించింది. ఇంతలో చేపలు గుచ్చిన తాడుతో అక్కడికి ఒక జాలరి వచ్చాడు. అప్పుడు ప్రాప్తకాలజ్ఞుడు నేనిప్పుడు ఆ తాడుని నోటితో కరచి పట్టుకుంటా. జాలరి నన్ను చూచి గుచ్చబడిన చేపే అని అనుకుంటాడు. తర్వాత అతడు వెళ్ళిపోయాక మంచి మడుగులోకి దూకి తప్పించుకుంటా అని అనుకుని అలాగే చేసింది.

ఎలా తప్పించుకోవాలా అని అప్పటికప్పుడు ఆలోచిస్తున్న దీర్ఘసూత్రుని జాలరి పట్టుకుని తాడుకు గుచ్చి బుట్టలో వేసుకున్నాడు. ఆ మడుగులోని చేపలన్నిటినీ పట్టుకున్న జాలర్లు ఇళ్ళకు బయలుదేరారు. వారికి దారిలో ఒక పెద్ద కాలువ కనబడింది. బురదతో ఉన్న చేపల్ని కడగడానికి జాలర్లు కాలవలోకి దిగారు. ప్రాప్తకాలజ్ఞుడు వెంటనే ఆ తాడును వదిలిపెట్టి జాలర్లకు అందకుండా కాలువలో మునిగి తప్పించుకుంది. చూశారా! ఆపద వస్తుందని ముందు చూపుతో దీర్ఘదర్శి తన ప్రాణాలను కాపాడుకుంది. సమయస్ఫూర్తితో ప్రాప్తకాలజ్ఞుడు తన ప్రాణాలను రక్షించుకుంది. మందబుద్ధితో, నిర్లక్ష్యంతో దీర్ఘసూత్రుడు తన ప్రాణాలను పోగొట్టుకుంది.

## కవి పరిచయం

**శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (23.4.1891 - 25.2.1961)**




తేటతెనుగు నుడికారానికి, అచ్చమైన మానవ సంబంధాల చిత్రణకి కొండగుర్తులాంటి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథకులు, నవలాకారులు, నాటక కర్త. ఎన్నో చిన్న కథల సంపుటాలు వెలవరించారు. రాజరాజు వంటి నాటకాలు, 'ఆత్మబలి', 'రక్షాబంధనము' వంటి నవలలను రచించారు. 'అనుభవాలూ-జ్ఞాపకాలూ' అన్న పేరుతో వెలవరించిన స్వీయచరిత్ర ఆనాటి ఆంధ్రుల సాంఘిక చరిత్ర.



Scanned with CamScanner

# 7. పద్యరత్నాలు

A9V6V6




**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో ఏం జరుగుతున్నది? ఎవరెవరు ఉన్నారు? వారు ఏం చేస్తున్నారు?
2. మీకు తెలిసిన ఏవైనా పద్యాలు పాడండి.
3. మీరు ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడైనా చూశారా? చూసినప్పుడు మీకు ఏమనిపిస్తుంది?



Scanned with CamScanner



# పద్యరత్నాలు



**1.**

అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు నెడతెగకపారు నేరును ద్విజుడున్
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ!

– బద్దెన

**భావం**

ఓ మంచిబుద్ధి గలవాడా! అవసరానికి అప్పిచ్చేవాడు, వైద్యుడు, ఎల్లప్పుడు ప్రవహించే నది, మంచి చెడ్డలు చెప్పే పండితుడు ఉన్నఊళ్లో ఉండు. అవిలేని ఊళ్లో నివసించవద్దు.

**2.**

ప్రశ్న నుండి పుట్టు పరిణతి జ్ఞానమ్ము
ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము
ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్థకమ్మురా!
నవయుగాలబాట నార్లమాట

– నార్ల వేంకటేశ్వరరావు

**భావం**

ప్రశ్నకు జవాబులు వెతకడం ద్వారానే ఈ లోకంలో జ్ఞానం వృద్ధి చెందుతుంది. ప్రశ్నించడం వల్లనే సమాజంలో మనిషి విలువ పెరుగుతుంది. ప్రశ్న లేకపోతే ప్రగతి శూన్యం అవుతుంది.

**3.**

చంపదగిన యట్టి శత్రువు తనచేత
జిక్కెనేని గీడు సేయరాదు
పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు
విశ్వదాభిరామ! వినురవేమ!

– వేమన

**భావం**

ఓ వేమా! చంపదగిన శత్రువు చేతికి చిక్కినా వాడికి కీడుచేయరాదు. తిరిగి ఏదైనా ఉపకారం చేసి పంపిస్తే అదే నిజమైన శిక్ష.

**4.**

మచ్చికలేనిచోట ననుమానము వచ్చినచోట మెండుగా
గుచ్చితులున్నచోట గుణకోవిదులుండని చోట విద్యకు
మెచ్చనిచోట రాజుకరుణించనిచోట వివేకులుండిరే
నచ్చుట మోసమంద్రు సుగుణాకర పెమ్మయ సింగధీమణీ

– చాటువు

**భావం**

చొరవ లేనిచోట, సందేహం ఉన్నచోట, చెడ్డవాళ్ళు ఎక్కువగా ఉన్నచోట, గుణం తెలుసుకొనే పండితులు లేని చోట, విద్యను మెచ్చుకోని చోట, రాజు దయలేని చోట, వివేకం కలిగిన వారు ఉన్నట్లయితే వాళ్లకు హానియే కలుగుతుందని పెద్దలు చెప్తారు.



Scanned with CamScanner

5.

నిజము మీద భూమి నిలబడి యుండును
సత్యవాక్కు వలన జనత నడుచు
సత్యమొకటిపాప సంహారమును జేయు
కాళికాంబ హంస కాళికాంబ

– పోతులూరి వీరబ్రహ్మం

భావం

నిజం కలకాలం భూమి మీద నిలబడి ఉంటుంది. సత్యవాక్కు వల్లనే జగతి నడుస్తుంది. సత్యాన్ని ఆచరిస్తే పాపాలన్నీ నశించిపోతాయి.

6.

ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము తనమనంబునకగుఁ దా
నొరులకు నవిసేయకునికిఁ
బరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

– తిక్కన

భావం

ఓ రాజా! ఇతరులు ఏ పని చేస్తే తన మనస్సుకు బాధ కలుగుతుందో, ఆ పని తిరిగి తాను ఇతరులకు చేయకుండటమే అన్ని ధర్మ మార్గాలలోనూ గొప్పది.

7.

నీతియె మూలము విద్యకు
నీతియె పురుషార్థ తత్త్వ నిర్ణాయకమున్
నీతియె భూతప్రీతియు
నీతియుతుం డెప్పుడొందు నియత పదంబున్

– ఏటుకూరి వెంకటనరసయ్య

భావం

విద్యకు నీతియే ఆధారం. చతుర్విధ పురుషార్థ తత్త్వాన్ని (ధర్మం, అర్థం, కామం, మోక్షం) నిర్ణయించేది కూడా నీతియే. సర్వ భూతాలకూ (ప్రాణులకూ) ప్రీతి కలిగించేది కూడా నీతియే. నీతిమంతుడైన వాడు ఎప్పుడూ తనకు తగిన స్థానాన్ని పొందుతాడు.

8.

చదువని వాడజ్ఞుండగు,
చదివిన సదసద్వివేక చతురత కలుగున్,
చదువగ వలయును జనులకు,
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!

– పోతన

భావం

చదవని వాడికి ఏమీ తెలియదు. చదువుకుంటే మంచి చెడులు తెలుసుకోగలిగిన వివేకం కలుగుతుంది. అందువల్ల మనుషులందరూ చదువుకోవాలి. ఉత్తములైన గురువుల వద్ద నిన్ను చదివిస్తాను నాయనా! చదువుకో! (అని హిరణ్య కశిపుడు ప్రహ్లాదునికి చెప్పాడు.)

9.

తరువులతిరసఫల భార గురుతఁగాంచు
నింగి వ్రేలుచు నమృతమొసంగు మేఘు
డుద్ధతులు గారు బుధులు సమృద్ధి చేత
జగతి నుపకర్తలకు నిది సహజగుణము

– భర్తృహరి సుభాషితం

భావం

చెట్లు నిండుగా రసం ఉన్న పండ్ల బరువుతో వంగిపోతాయి. ఆకాశంలో ఆధారం లేకుండా వేలాడుతూ మేఘుడు అమృతం వంటి నీటిని వర్షం ద్వారా ఇస్తాడు. నిండుగా సంపదలుండడం చేత పండితులైన వారు అహంకారం పొందరు. ఈ లోకంలో ఉపకారం చేసే వారికి ఇది సహజ లక్షణం.



Scanned with CamScanner

## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఎడతెగక | = | అడ్డులేకుండా | ఉపకర్త | = | ఉపకారం చేసేవాడు |
| ద్విజుడు | = | బ్రాహ్మణుడు | ఒరులు | = | ఇతరులు |
| చొప్పడిన | = | ఉన్నట్టి | అప్రియము | = | ఇష్టముకానిది |
| పొసగ | = | తగినట్లుగ | మనమునకు | = | మనస్సుకు |
| చిక్కనేని | = | దొరికితే | పరాయణము | = | అభీష్టం |
| కీడు | = | హాని | పరమధర్మము | = | గొప్పధర్మం |
| పరిణతి | = | మార్పు | వాక్కు | = | మాట |
| సంశయించు | = | సందేహించు | అజ్ఞుడు | = | తెలివి తక్కువవాడు |
| ప్రాభవం | = | గొప్పతనం | సత్ | = | మంచి |
| తరువు | = | చెట్టు | అసత్ | = | చెడు |
| గురుత | = | గొప్పతనం, బరువు | ఆర్యులు | = | పూజ్యులు |
| నింగి | = | ఆకాశం | కుచ్చితము | = | కపటము |
| వ్రేలుచు | = | వేలాడుతూ | మెండుగా | = | ఎక్కువగా |
| అమృతం | = | తియ్యని వాన నీరు | బుధులు | = | పండితులు |
| కోవిదుడు | = | విద్వాంసుడు | ఉద్ధతులుగారు | = | గర్వపడరు |
| మేఘుడు | = | మేఘం | నియత | = | నియమముగల |
| సమృద్ధి | = | ఎక్కువగలిగి ఉండడం | నిర్ణాయకమున్ | = | నిర్ణయించేది |
| పెన్నిధి | = | గొప్పదైన నిధి | | | |

## ఇవి చేయండి



### వినడం – ఆలోచించి మాట్లాడటం

1. పద్యాలను భావరాగయుక్తంగా పాడండి.
2. మీకు తెలిసిన కొన్ని నీతిపద్యాలు చెప్పండి.
3. చదువు లేకపోతే ఏమవుతుంది?



Scanned with CamScanner



## చదవడం - వ్యక్తపరచడం

అ) **కింది భావాలకు సరియైన పద్య పాదాలు రాయండి.**

1. మేఘం నీటితో నిండి ఉన్నప్పుడే వర్షిస్తుంది.

..............................................................................................................

2. మేలు చేసి పొమ్మనుటే పెద్ద శిక్ష.

..............................................................................................................

3. విద్యకు పునాది నీతి.

..............................................................................................................

4. సత్యం పాపాలు తొలగిస్తుంది.

..............................................................................................................

5. ప్రశ్నించడం వల్లనే సమాజంలో మనకు విలువ పెరుగుతుంది.

..............................................................................................................

ఆ) **కింది పేరా చదివి ఖాళీలు పూరించండి.**

ముక్తకం అంటే ఒక పద్యం. పూర్తి అర్థాన్ని తనకు తానే ఇస్తూ ఇతర పద్యాలతో సంబంధం లేకుండా స్వయం సంపూర్ణంగా వినిపించేది. తెలుగులో ముక్తక రచనకు 'శతక, చాటు' పద్యాలను ఉదాహరణగా చెప్పవచ్చు. వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు 'చాటు' పద్య రచనలో చాలా ప్రసిద్ధులు. ముక్తకం ఒక పద్య ప్రక్రియ. శతకంలో కూడ ముక్తక లక్షణం ఉంటుంది.

1. స్వయం సంపూర్ణమైన పద్యాన్ని ................................ అంటారు.
2. ముక్తక రచనకు ఉదాహరణగా ............................ పద్యాలు చెప్పవచ్చు.
3. తెనాలి రామకృష్ణుడు ....................... పద్యరచనలో ప్రసిద్ధుడు.
4. శతకంలో ..................... లక్షణం ఉంటుంది.

ఇ) **గబగబా చదవండి చూద్దాం.**

అడిగెదనని కడువడిజను
నడిగినదనుమగుడ నుడువడని నడయుడుగున్
వెడవెడ చిడుముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్





## పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలు రాయండి.**

1. కీడు = ....................  2. పథం = ....................
3. ప్రాభవం = ....................  4. నింగి = ....................
5. తరువు = ....................  6. పెన్నిధి = ....................
7. అప్రియం = ....................  8. వాక్కు = ....................

**ఆ) ఎవరెవరు ఏమి రాశారో జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | వేమన శతకం | ( ) | అ) బద్దెన |
| 2. | సుమతీ శతకం | ( ) | ఆ) ఏనుగు లక్ష్మణ కవి |
| 3. | మహాభారతం | ( ) | ఇ) వేమన |
| 4. | సుభాషిత రత్నాలు | ( ) | ఈ) వీర బ్రహ్మేంద్రస్వామి |
| 5. | కాళికాంబ శతకం | ( ) | ఉ) తిక్కన |

**(ఇ) కింది పదాలకు వచనాలు రాయండి.**

1. పద్యం - ..................  5. ప్రశ్న - ..................
2. నేరం - ..................  6. బుధుడు - ..................
3. శత్రువు - ..................  7. తరువు - ..................
4. కవి - ..................  8. ఫలము - ..................



## స్వీయరచన

1. మనం ప్రశ్నలు ఎందుకు వేస్తాం?
2. ఒక గ్రామంలో ఎవరెవరు ఉండడం అవసరమని పద్యంలో చెప్పారు?
3. ఉపకారం చేసేవారికి ఎలాంటి సహజగుణాలు ఉంటాయి?
4. శత్రువు విషయంలో మనం ఎలా ప్రవర్తించాలి?



## సృజనాత్మకత

**మీకు తెలిసిన పద్యభావం ఆధారంగా చిన్న కథను రాయండి.**



## ప్రశంస

**మీ తరగతి గదిలో ఎవరు బాగా పద్యాలు పాడతారు? వారిని నీవు ఎలా ప్రశంసిస్తావు?**



## భాషాంశాలు

**(అ) కింది వాక్యాలు చదవండి.**

సాధారణంగా భాషలో పదజాలాన్ని పురుషులను సంబోధించే పదాలు, స్త్రీలను సంబోధించే పదాలు, ఇతరులను సంబోధించే పదాలు (పక్షులు, జంతువులు, జడాలు) అని విభాగం చేయవచ్చు. వీటినే పుంలింగం, స్త్రీ లింగం, నపుంసక లింగం అంటారు. కొన్ని భాషల్లో అర్థంతో సంబంధం లేకుండా పద స్వరూపాన్ని బట్టి లింగం ఉంటుంది. కొన్ని భాషల్లో అర్థాన్ని బట్టి లింగం ఉంటుంది. తెలుగులో అర్థం ప్రమాణం.

తెలుగు వ్యాకరణాలలో ఈ విభాగాన్ని లింగం అనకుండా **వాచకం** అంటారు. పురుషులను బోధించే పదాలు **మహత్తులు**, తక్కినవి **అమహత్తులు.** వాక్య నిర్మాణంలో స్త్రీలను సంబోధించే పదాలు ఏకవచనంలో అమహత్తుతోనూ, బహువచనంలో మహత్తుతోనూ చేరతాయి.

ఉదా: అతను వచ్చాడు

అది / ఆమె వచ్చింది

వాళ్లు (స్త్రీలు / పురుషులు / స్త్రీ పురుషులు) వచ్చారు

అవి వచ్చాయి.

అందువల్ల స్త్రీలను బోధించే పదాలను విడిగా చెప్పాలంటే వాటిని **మహతీ వాచకాలు** అంటారు.

**(ఆ) కింది పురుషవాచక పదాలకు స్త్రీ వాచక పదాలు రాయండి.**

1. ఉపాధ్యాయుడు – ఉదా: ఉపాధ్యాయిని
2. నటుడు – ..................................
3. గాయకుడు – ..................................
4. కళాకారుడు – ..................................
5. సైనికుడు – ..................................





## ధారణ చేద్దాం

ఉ ॥ మాటలచేత దేవతలు మన్నన జేసి వరంబు లిత్తు, రా
మాటలచేత భూపతులు మన్నన జేసి ధనంబు నిత్తు, రా
మాటలచేత మానినులు మన్నన జేసి మనంబు లిత్తు, రా
మాటలు నేర్వకున్న మరి మానము హానము కాదె యేరికిన్ ॥

**భావం :** మాట మంచిదైతే దేవతలు వరాలు ఇస్తారు. ఆ మాటలు రాజులకు నచ్చితే బహుమతులిస్తారు. ఆ మాటలలోని మాధుర్యాన్ని స్త్రీలు ఇష్టపడతారు. ఆ మాటలు సరిలేనప్పుడు ఎవరికైనా గౌరవం పోతుంది.

– భర్తృహరి సుభాషితం



Scanned with CamScanner



చదువుదాం

# కలమల్ల శాసనం

N4X8A4

పూర్వకాలంలో రాజులు శాసనాలు వేసేవారు. శాసనం రాజాజ్ఞను తెల్పుతుంది. శాసనాలు వాటిలోని విషయాన్ని బట్టి మూడు రకాలుగా ఉంటాయి. ఎక్కువభాగం ఇవి దానశాసనాలు. కొన్ని ప్రశస్తి శాసనాలు. మరికొన్ని ధర్మలిపి శాసనాలు.

దానశాసనాలంటే రాజులు, రాజ్యాధికారులు, సామంతులు మొదలైనవారు ఆలయాలకు, బ్రాహ్మణులకు, మఠాలకు, విద్యాసంస్థలకు చేసిన దానాలను తెల్పేవి. ప్రశస్తి శాసనాలంటే రాజు విజయాలను ప్రశంసించేవి. ధర్మలిపి శాసనాలు మతపరమైన నియమాలను తెల్పేవి.

ఆంధ్రదేశంలో లభించే శాసనాలు కొన్ని శిలలపై చెక్కినవి. మరికొన్ని రాగిరేకులపై చెక్కినవి. ఆంధ్ర దేశంలో క్రీస్తుపూర్వం నుండే శాసనాలు లభిస్తున్నాయి. మొదటి శాసనాలు ప్రాకృత భాషలో ఉన్నాయి. తర్వాత సంస్కృత ప్రాకృత మిశ్రంగానూ, ఆ తర్వాత సంస్కృతంలోనూ శాసనాలు వచ్చాయి. ఈ శాసనాలలో ఊళ్ల పేర్లు, వ్యక్తులపేర్లు తెలుగులో కనిపిస్తాయి.

మొత్తం తెలుగులోనే మొదటిసారి శాసనాలు వేసినవారు రేనాటి చోళులు. రేనాడు అంటే ఇప్పటి వై.ఎస్.ఆర్. కడప జిల్లా ప్రాంతం. రేనాటి చోళరాజు ఎరికల్ ముతురాజు ధనుంజయుడు కలమల్ల గ్రామంలో వేసిన శాసనం ఇది. శాసనంలోని పదాలన్నింటికీ మనకు ఇంకా స్పష్టమైన అర్థాలు తెలియవు. ఇది దాన శాసనం. ఈ దానాన్ని పాడుచేసిన వారికి పంచమహాపాతకాలు కలుగుతాయని శాపవాక్యంతో శాసనం ముగిసింది.

1. .......
2. కల్ము (తు) రా-
3. జుధనంజ
4. యున్ఱు రేనా
5. ణ్డు ఏళన్
6. చిఱుంబూరి
7. రేవణకాలు (పం)
8. పుచెనూరుకా జు
9. అ టి కళా ఊరి
10. (ణ్డ) వారు ఊరి
11. టి
12. .....
13. .....
14. .....
15. .. పఞ్చమ ..
16. హాపాతకస....
17. కు





**కలమల్ల**
తొలి తెలుగు శాసనం

నాటి తెలుగు భాష ఎలావుందో, లిపి ఎలా వుందో, శాసనమెలా ఉంటుందో మీరు తెలుసుకోవడానికి ఇదొక ఉదాహరణ.

**(తొలి తెలుగు దివ్వె** - తెలుగు మూలాల అధ్యయన సంఘం వారి సౌజన్యంతో)

# 8. ఇటిజ్ పండుగ

M6H1K2



**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో ఏం జరుగుతున్నది? ఎవరెవరున్నారు?
2. మీరు జరుపుకునే ఒక పండుగ గురించి చెప్పండి.

## కవి పరిచయం

### గిడుగు వేంకట రామమూర్తి (29.8.1863- 22.1.1940)




ఆధునిక తెలుగు భాషా ప్రవక్త. ప్రజల జీవితానికి దూరంగా ఉన్న గ్రాంథిక భాష స్థానంలో ప్రజల వాడుక భాషకు పట్టం కట్టిన యోధుడు. తన జీవితకాలం వ్యావహారిక భాషా ఉద్యమానికి, గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేశారు. సవరల కోసం సవర భాషా మాధ్యమంలో తొలి పాఠశాల నడిపారు. సవర పాటలు, కథలు సేకరించి సవర వాచకాలు రూపొందించారు. సవర-ఇంగ్లీషు నిఘంటువును రూపొందించడమే కాక సవర భాషలో మౌలికమైన పరిశోధన చేశారు. సవరల కోసం సవర వ్యాకరణం రచించారు. భారతదేశంలోని తొలి తరం మానవశాస్త్రవేత్తలో ఒకరు. 'బాలకవి శరణ్యం', 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం' మొదలైన గ్రంథాలు రచించారు. ఈయన స్ఫూర్తికి అనుగుణంగా గిరిజనుల గురించిన పాఠ్యాంశాన్ని ఇక్కడ పొందుపరిచాం.

# ఇటిజ్ పండుగ

విజయవాడ నుండి క్రాంతి, అక్షయలు కుటుంబ సభ్యులతో కలిసి పాడేరు వచ్చారు. అక్కడ వాళ్ళ పెదనాన్న ఉద్యోగం చేస్తున్నారు. ఇంటికి వెళుతుంటే దారిలో డప్పులు, తుడుములు, కొమ్ముబూర మొదలయిన వాయిద్య శబ్దాలు వినబడ్డాయి.

క్రాంతి : పెదనాన్న! ఏమిటా సందడి?

పెదనాన్న : వాళ్ళు "ఇటిజ్ పండుగ" చేసుకుంటున్నారు. దీనినే కొంతమంది గిరిజనులు 'ఏటిజ్' అని కూడా అంటారు.





Scanned with CamScanner

అక్షయ : ఇటిజ్ పండుగ అంటే ఇటుకలు పెట్టి చేస్తారా?

క్రాంతి : ఇలాంటి పండుగ గురించి మేము ఎప్పుడూ వినలేదు. దీనిని ఎవరు చేసుకుంటారు.

పెదనాన్న : విశాఖ, విజయనగరం జిల్లాలలోని మన్యం వాసులు చేసుకుంటారు.

అక్షయ : ఎప్పుడు చేస్తారు?

పెదనాన్న : మార్చి లేదా ఏప్రిల్ నెలలో చేస్తారు. ఒడియా సాహచర్యం ఉన్నవారు చైత్ పొరొబ్ (చైత్రపర్వం) అని అంటారు. గిరిజనేతరులు ఇటుకల పండుగ అని అంటారు.



ఇద్దరు : పెదనాన్న! ఆ పండుగ చేసుకునే వారి దగ్గరకి వెళదామా!?

పెదనాన్న : అలాగే!

క్రాంతి : ఇటిజ్ పండుగ ఎలా చేస్తారు పెదనాన్నా?

పెదనాన్న : మన మొట్టమొదటి పండుగ ఉగాది జరుపుకుంటాం కదా! అలాగే వారు ఉగాది తరువాత నవమి మధ్యలో ఈ పండుగ చేస్తారు. వారూ మనలాగే పన్నెండు నెలలకు పేర్లు పెట్టుకున్నారు. అందులో నాలుగవది 'ఏటిజ్'. ఆ నెలలో జరిపే పండుగ ఇటిజ్ పండుగ. వారి వెసులుబాటు ననుసరించి గ్రామస్థులు సమావేశం పెట్టుకుంటారు. తదుపరి శుక్రవారం చాటింపు వేస్తారు. ఆ తరువాతి శుక్రవారం నుండి పండుగ ప్రారంభం అవుతుంది.

అక్షయ : అబ్బా! ఆ ఇంటి ముందు, గోడలపైన ముగ్గులు! మామిడి ఆకు తోరణాలు ఎంత బాగున్నాయో!!

పెదనాన్న : పండుగ జరగడానికి ముందు ఇలా అలంకరించుకుంటారు. పండుగ రోజు మన రైతుల మాదిరి గానే నాగలి, మోకు, పలుపు తాళ్ళు, పార, కొంకి మొదలయిన వ్యవసాయ పనిముట్లు కడిగి 'కుదురు' (దేవుని మూల) దగ్గర పెట్టి పూజిస్తారు.

క్రాంతి : పెదనాన్న! అదేంటి?! గిన్నెలలో ఒకరికొకరు ఏదో ఇచ్చి పుచ్చుకుంటున్నారు.

పెదనాన్న : అవును క్రాంతి. మామిడి కాయలను ఇంటికి తెచ్చి వాటిని ముక్కలుగా కోస్తారు. బియ్యంతో ఆ ముక్కలను కలిపి వండుతారు. దానిని 'బోనం' అంటారు. ఆ బోనం నైవేద్యంగా దేవునికి సమర్పిస్తారు. తరువాత నైవేద్యం, అన్నం, కూరలు, వంటలు మొదలైనవి ఇరుగు పొరుగువారు, బంధువులు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు.

అక్షయ : ఆ తరువాత ఏం చేస్తారు పెదనాన్న?

పెదనాన్న : రెండవరోజు 'రొడ్డ కనుసు' చేస్తారు.

క్రాంతి : రొడ్డ కనుసా!? అంటే ఏమిటి?

పెదనాన్న : 'రొడ్డ' అంటే మామిడి, సీతాఫలం మొదలైన ఆకులు. 'కనుసు' అంటే ఊరేగింపు. రెండవరోజు ఆకులు కట్టుకుంటారు. తలకు పక్షి ఈకలు కట్టుకుంటారు. ముఖంపై నలుపు, తెలుపు రంగులు చారలుగా పూసుకుంటారు. రంగులు, బూడిద కలిపిన నీరు వెదురుగొట్టాల్లో నింపి ఒకరిపై ఒకరు జల్లుకుంటారు. పనసకాయను జంతుతల ఆకారంగా చేస్తారు. దానిపైకి బాణాలు వేస్తూ, ఆడుతూ, పాడుతూ సంకుదేవుని దగ్గరకు వెళతారు.

అక్షయ : ఎందుకు వెళతారు?



Scanned with CamScanner



పెదనాన్న : సంకుదేవుని కొరకు ప్రతి ఇంటి నుండి గుప్పెడు చొప్పున విత్తనాలు, బియ్యం సేకరిస్తారు. గుడిదగ్గర బియ్యం వండి నైవేద్యం పెడతారు. విత్తనాలు కొన్ని గుడి చుట్టూ చల్లుతారు. మిగిలిన విత్తనాలు వారం రోజులు తరువాత ఇంటింటికి పంచుతారు. అవి వారి విత్తనాలలో కలుపుకుంటారు.

క్రాంతి : భలే విచిత్రంగా ఉంది. ఆ తరువాత?!

పెదనాన్న : మూడు నుండి ఆరు రోజుల్లో ఏదో ఒక రోజు గ్రామస్థులంతా వేటకు వెళతారు. వేటకు వెళ్ళని వారిని వరసైన వారు ఎగతాళి చేస్తారు. వేట సాధించిన వారికి ప్రత్యేక గౌరవం ఉంటుంది.

అక్షయ : ఏడవ రోజు ఏం చేస్తారు?

పెదనాన్న : ఆఁ ... చివరి రోజును 'మారు ఇటిజ్' లేక 'నూరు ఇటిజ్' అంటారు. ఆరోజు దారికి అడ్డంగా వెదురు బొంగు కడతారు. వెదురు గొట్టాలతో వచ్చేపోయే వారిపై నీళ్ళు చల్లుతారు. వెదురు కర్రకు తాళ్ళను కట్టి ఊయలగా చేసి ఊగుతారు.

అక్షయ, క్రాంతి : చాలా బాగుంది పెదనాన్న వీరి పండుగ.

పెదనాన్న : అవును. మన రాష్ట్రంలో రాయలసీమలో కొన్ని పండుగలు, కోస్తాలో కొన్ని పండుగలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. అలాగే గిరిజన ప్రాంతాలలో కూడా రకరకాల పండుగలు జరుపుకుంటారు. ఇవి వారి వారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు.



Scanned with CamScanner

## పదాలు-అర్థాలు

| | | |
|---|---|---|
| తుడుము | = | గిరిజన వాయిద్య పరికరం |
| కొమ్ముబూర | = | కొమ్ముతో తయారు చేసే బూర |
| సందడి | = | పండుగలో అందరూ కలిసిమెలిసి తిరగడం |
| మొక్కుబడులు | = | భగవంతునికి చెల్లించే ముడుపులు |
| తోరణం | = | గుమ్మాలకు మామిడాకులతో కట్టే దండ |
| కుదురు | = | కుండలు కదలకుండా నిలిపే గుండ్రని అమరిక |
| హేళన | = | ఎగతాళి |
| థింసా, కోయ | = | గిరిజన నృత్యాలు |
| అటక | = | చిన్నమిద్దె |
| రొడ్డ కసుసు | = | గ్రామ ఊరేగింపు |

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. పండుగ అంటే ఏమిటి?
2. ఇటిజ్ పండుగ ఎలా జరుపుకుంటారు?
3. మనం జరుపుకునే పండుగలకు, గిరిజనులు జరుపుకునే పండుగలకు తేడా ఏమిటి?

### చదవడం - వ్యక్తపరచడం

అ) **కింది పేరాను చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

గణతంత్ర దినోత్సవం జరుపుకోవడానికి పిల్లలు బడిని అందంగా ముస్తాబు చేస్తారు. వారివారి తరగతులను రంగురంగుల కాగితాలతో అలంకరిస్తారు. గుమ్మాలకు తోరణాలు కడతారు. తరగతిగది లోపలా బయటా ముగ్గులు వేస్తారు. పిల్లలందరూ దేశభక్తిగీతాలు సాధన చేసి జెండా వందనం రోజు పాడతారు. జనవరి 26వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవాన్ని ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవడం పిల్లలకు ఎంతో ఇష్టం. ఆ రోజు బడి అంతా పండుగ వాతావరణంతో కళకళలాడుతుంది.



1. గణతంత్ర దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?

..............................................................................



Scanned with CamScanner

2. మీ బడిని గణతంత్ర దినోత్సవం రోజున ఎలా అలంకరిస్తారు?

.............................................................................................

3. మీరు ఏయే దేశభక్తిగీతాలు పాడతారు?

.............................................................................................

4. మీ బడిలో ఏయే పండుగలు జరుపుకుంటారు?

.............................................................................................

**అ) కింది పండుగ గురించి చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.**



మన పండుగలలో "దసరా" ఒకటి. ఇది ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు తొమ్మిది రోజులు జరుగుతుంది. అందుకే "దేవీ నవరాత్రులు" అంటారు. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి దశమిరోజు విజయం సాధించింది. అందుకే పదవ రోజును విజయదశమి అంటారు. ఈ పండుగ "శక్తి" ఆరాధనకు ప్రాధాన్యం ఇస్తుంది. ఈ పండుగ రోజుల్లో దేవికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంతో పూజలు చేస్తారు. విజయదశమి నాడే రాముడు రావణాసురునిపై విజయం సాధించాడు. అజ్ఞాత వాస సమయంలో జమ్మిచెట్టుపై పెట్టిన ఆయుధాలు పాండవులు తిరిగి తీసుకున్న రోజు కూడా విజయదశమే. అందువల్ల జమ్మి ఆకులతో ఈరోజు పూజచేస్తే మంచి జరుగుతుందంటారు.

1. .............................................................................................
2. .............................................................................................
3. .............................................................................................
4. .............................................................................................
5. .............................................................................................



## పదజాలం

**అ) ఇటిజ్ పండుగ పాఠంలో మీరు గమనించిన కొత్త పదాలను రాయండి.**

| | |
|---|---|
| 1. ఉదా : చైత్ పొరొబ్ | 2. ................................ |
| 3. ................................ | 4. ................................ |
| 5. ................................ | 6. ................................ |
| 7. ................................ | 8. ................................ |



Scanned with CamScanner

**ఆ) పాఠంలో ఆడుతూపాడుతూ లాంటి జంట పదాలు ఉన్నాయి. కింది జంట పదాలను చదవండి. వాటిలో ఏవైనా నాలుగు జంట పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

| | | | |
|---|---|---|---|
| శుచి - శుభ్రం | అన్నెం - పున్నెం | ఇరుగు - పొరుగు | ఇల్లు - వాకిలి |
| ఊరు - పేరు | ఉక్కిరి - బిక్కిరి | తిండి - తిప్పలు | కట్టు - బొట్టు |
| చిందర - వందర | నగ - నట్ర | పొలం - పుట్ర | కూర - నార |

.............................................................................................

.............................................................................................

.............................................................................................

.............................................................................................

**ఇ) కింది మాటలను చూడండి. మొదట + మొదట = మొట్టమొదట అవుతుందని మన వ్యాకరణాలు చెప్తున్నాయి. ఇటువంటి మరికొన్ని మాటలు చూడండి.**

| | | |
|---|---|---|
| తుట్ట - తుట్టతుద | అట్ట - అట్టడుగు | కట్ట - కట్టకడ |
| చిట్ట - చిట్టచివర | ఎట్ట - ఎట్టకేలకు | పట్ట - పట్టపగలు |

వీటిలో నాలుగింటిని వాక్యాలలో ఉపయోగించండి

ఉదా : మొట్టమొదట: మన మొట్ట మొదటి - పండగ ఉగాది.

.............................................................................................

.............................................................................................

.............................................................................................

.............................................................................................



## స్వీయరచన

1. ఇటిజ్ పండుగను ఎప్పుడు చేసుకుంటారు?
2. కుదురు వద్ద ఏం పెడతారు? దానిని ఎలా తయారుచేస్తారు?
3. ఇటిజ్ పండుగ రెండవరోజు ఎలా జరుపుకుంటారు?
4. ఇటిజ్ పండుగ చివరిరోజు ఏయే కార్యక్రమాలు చేస్తారు?
5. మీరు జరుపుకునే ఒక పండుగ గూర్చి రాయండి.



Scanned with CamScanner



## సృజనాత్మకత

ఇటీజ్ పండుగ గూర్చి నీ మిత్రునకు లేఖ రాయండి.



## ప్రశంస

రామి 5వ తరగతి చదువుతూంది. రామికి జానపదగీతాలు సేకరించడం చాలా ఇష్టం. వాటిని చక్కగా పాడుతుంది. తోటి పిల్లలందరికీ నేర్పుతుంది. మీరు రామిని ఎలా ప్రశంసిస్తారో రాయండి.



## భాషాంశాలు



అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన అక్షరాలను గమనించండి.

1. పాలు, సేమ్యా<u>తో</u> పాయసం చేస్తారు.
2. మీ <u>కోసం</u> నేను బొమ్మలు తెచ్చాను.
3. తరుణ్ <u>గురించి</u> వాళ్ళ అమ్మ బడికి వెళ్ళింది.
4. సుస్మిత<u>కు</u> శిరీష చాక్లెట్లు ఇచ్చింది.
5. హనుమంతుడు రాముని <u>యొక్క</u> దూతగా లంకకు వెళ్ళాడు.

పై వాక్యాలలో గీత గీసిన వాటిని గమనించారు కదా! ఇవి లేకుంటే వాక్యాలు పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు కదా! అంటే ఇవి వాక్యంలో పదాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తున్నాయి. ఇలాంటి వాటిని 'విభక్తి ప్రత్యయాలు' అంటారు. ఈ ప్రత్యయాలు ఎనిమిది. ఇవి లేకపోతే పదాల మధ్య సంబంధం సరిగా తెలియదు.

| | విభక్తి ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|---|
| 1. | డు, ము, వు, లు | ప్రథమా విభక్తి |
| 2. | ని(న్), ను(న్), ల(న్) కూర్చి గురించి | ద్వితీయా విభక్తి |
| 3. | చేత(న్), చే(న్), తోడ(న్), తో(న్) | తృతీయా విభక్తి |
| 4. | కొరకు(న్), కై | చతుర్థీ విభక్తి |
| 5. | వలన(న్), కంటె(న్), పట్టి | పంచమీ విభక్తి |
| 6. | కి(న్), కు(న్), యొక్క లో(న్), లోపల(న్) | షష్ఠీ విభక్తి |
| 7. | అందు(న్), న(న్) | సప్తమీ విభక్తి |
| 8. | ఓ, ఓరి, ఓయి, ఓసి | సంబోధన ప్రథమా విభక్తి |



Scanned with CamScanner

కింది ఖాళీలను సరైన ప్రత్యయాలతో పూరించండి. విభక్తులను బ్రాకెట్లలో రాయండి.

ఉదా : ఊరిలో ఇటిజ్ పండుగ చేస్తున్నారు. (షష్ఠీ విభక్తి)

1. శ్రీకాకుళం ...... దీనిని 'మామిడి టెంక పండుగ' అంటారు. ( )
2. ఇటిజ్ పండుగ ...... 'చైత్‌పోరాబ్' అని కూడా అంటారు. ( )
3. ఈ పండుగ విజయనగరం ప్రాంతం ...... చేస్తారు. ( )
4. మంచిపుస్తకం .......... మంచి మిత్రుడు లేడు. ( )
5. మట్టి ............ బొమ్మలు చేయవచ్చు. ( )



## ప్రాజెక్టు పని

మీ గ్రామాల్లో జరిగే పెళ్లిళ్ళు, పండుగలు జాతరలలో ఉపయోగించే సంగీత వాయిద్యాల గురించి సమాచారం సేకరించి పట్టిక రాయండి. అందులో ఒక వాయిద్యం గురించి రాసి, తరగతి గదిలో ప్రదర్శించండి.



## పాడుకుందాం తేనెకన్న మధురంరా తెలుగు



ఆరుద్ర

తేనెకన్న మధురం రా, తెలుగు, ఆ
తెలుగుదనం మా కంటి వెలుగు.

తెలుగుగడ్డ పోతుగడ్డ ఎంత పచ్చన, మా
తెలుగు గుండెలో స్నేహం ఎంత వెచ్చన!
మన పొలాల శాంతి పులుగు ఎంత తెల్లన, మన
తరతరాల కథను పాడు గుండె ఝల్లన.
పాటుపడిన వాళ్ళకే లోటు లేదని
చాటి చెప్పు తల్లికదా తెలుగుతల్లి

లలితకళలు సంగీతం సాహిత్యం
తెలుగుతల్లి జీవితాన దినకృత్యాలు.
గత చరిత్ర ఘన చరిత్ర ఎంత ఖ్యాతి!
గర్వించదగ్గ జాతి తెలుగుజాతి!
అయినా గతంకన్న భవిష్యత్తు ఆశాజనకం
ఆ భావికొరకు ధరించాలి దీక్షాతిలకం.


అ) కింది పాట పాడండి. ఇవి సవర భాషలో, తెలుగు భాషలో ఉన్నాయి.

| సవర భాషలో | | | తెలుగులో |
|---|---|---|---|
| డై డై మామలే | – | ఆడాతోరన్ పాఙ్తియై | చందమామ – చిక్కని తేనేతేవే |
| డై డై మామలే | – | తర్దా జావు పాఙ్తియై | చందమామ – అన్నంముద్ద తేవే |
| డై డై మామలే | – | కింతే గురన్ పాఙ్తియై | చందమామ – అరటి పళ్ళు తేవే |
| డై డై మామలే | – | గోతోర్ గోతోర్ డక్కుఱ. | చందమామ – పాపకి కితకితలు పెట్టవే. |



Scanned with CamScanner


# క్రిస్మస్



ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న పండుగలలో క్రిస్మస్ పండుగ ఒకటి. ఈ పండుగ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. డిసెంబర్ 24న క్రిస్మస్ ఈవ్‌గానూ, 25న క్రిస్మస్‌గానూ జరుపుకుంటారు.

సంప్రదాయ కథనాల ప్రకారం జీసస్ ఒక పశువులశాలలో, పశువుల మధ్య పుట్టాడని, జన్మించగానే ఆయన తల్లి మేరీ మాత ఆయనను వస్త్రాలతో చుట్టి వారున్న ధర్మశాలలో ఖాళీ లేనందున పశువుల కొట్టంలోనే ఉంచవలసి వచ్చిందని 'బైబిలు' చెబుతోంది. ఆయన పుట్టిన రోజు రాత్రి ఆ ఊరికి పక్కనున్న పొలాల్లో కొందరు పశువుల కాపర్లు తమ గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ ఉన్న వెలుగుకు గొర్రెల కాపరులు భయపడ్డారు. దేవదూత వాళ్ళతో "భయపడకండి ఇదిగో! మీకొక సంతోషకరమైన శుభవార్త. ఇవ్వాళ బెత్లహేంలోని ఒక పశువుల పాకలో లోకరక్షకుడు పుట్టాడు. ఆయన అందరికీ ప్రభువు. ఒక పసికందు పొత్తిగుడ్డలో చుట్టబడి పశువులశాలలో ఉన్న దాణాతొట్టెలో పడుకుని ఉంటాడు. ఇదే మీకు ఆనవాలు". దేవదూత ఇలా చెబుతుండగా పొలమంతా దేవదూతలతో నిండిపోయింది. వాళ్ళంతా దేవునికి స్తుతి గీతాలు పాడి మాయమయ్యారు. గొర్రెల కాపరులు హుటాహుటిన వెళ్ళి దేవదూత చెప్పిన పశువుల పాకకు చేరుకున్నారు. అక్కడ తొట్టెలో పడుకుని ఉన్న శిశువును చూసారు.

అలా 2000 సంవత్సరాల కిందట డిసెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించాడు. అందువల్ల ఆ మరునాడు అంటే డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ పండుగని జరుపుకుంటున్నారు.



ఈ పండుగకు క్రైస్తవులు తమ ఇళ్ళను, చర్చిలను అలంకరిస్తారు. వెదురుబద్దలతో, రంగు కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటికప్పు మీద ఎత్తులో పెడతారు. రాత్రివేళ దీపాలంకరణలతో ఇళ్ళు, చర్చిలు అందంగా ఉంటాయి. ప్రతిఇంట్లోనూ ఒక క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేస్తారు. ఇది ఈ పండుగ ప్రత్యేకత. ఈ చెట్టును రంగురంగుల కాగితాలతోనూ, కాగితపు నక్షత్రాలతోనూ, చిరుగంటలతోనూ, చిన్నచిన్న గాజు గోళాలతోనూ అలంకరిస్తారు. క్రిస్మస్ రోజున బంధువుల ఇళ్ళకు, మిత్రుల ఇళ్ళకు వెళ్ళి ప్రేమాభిమానాలతో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతారు.

M8K3Y8



Scanned with CamScanner

# 9. తరిగొండ వేంగమాంబ



సావిత్రిబాయి పూలే
ప్రథమ మహిళా ఉపాధ్యాయిని



సరోజినీనాయుడు
భారత కోకిల



కస్తూర్బాగాంధీ
స్వాతంత్ర్య సమరయోధురాలు



ఆతుకూరి మొల్ల
తెలుగులో రామాయణం రచించిన తొలి కవయిత్రి

**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? వారి గురించి మీకు తెలిసింది చెప్పండి.
2. మీ అమ్మ గురించి చెప్పండి.
3. మీరు చూసిన ఉద్యోగం చేస్తున్న ఆడవాళ్ళ గురించి చెప్పండి.



Scanned with CamScanner

# తరిగొండ వేంగమాంబ



ఆదిమ సమాజంలో వ్యక్తులందరూ సమానులే. కాని కాలక్రమంలో వ్యక్తుల మధ్య అంతరాలేర్పడ్డాయి. కుల మతాది భేదాలతో పాటు ధనికులు, పేదలు, పండిత పామరులు, అధికారులు, సామాన్యులు, పాలకులు, పాలితులు వంటి భేదాలు, హెచ్చు తక్కువలు ఏర్పడ్డాయి. అట్లాగే పురుషస్వామ్యం, ఆధిక్యం ఏర్పడి స్త్రీల పట్ల వివక్ష, చిన్నచూపు చోటు చేసుకున్నాయి.

ఆదిమకాలం నుండి నేటి వరకు ప్రతిభా పాటవాలలో, శక్తి సామర్థ్యాలలో పురుషులకు తీసిపోమని నిరూపించుకున్న మహిళామణు లెందరో ఉన్నారు. అటువంటి మహిళలలో తరిగొండ వేంగమాంబ ఒకరు.

వేంగమాంబ రెండున్నర శతాబ్దాల కిందటి చిత్తూరుజిల్లా తరిగొండ గ్రామంలో జన్మించింది. తండ్రి పేరు కానాల కృష్ణయార్యుడు. తల్లిపేరు మంగమాంబ. బాల్యంలోనే ఆమెలో భక్తి భావనలు వేళ్లూనుకున్నాయి. ఆనాడు చిన్నపిల్లలకే పెళ్లిళ్లు చేసేవారు. అదేవిధంగా వేంగమాంబకు కూడా పెళ్లి అయింది. కాని ఆమె మనసు సంసారం మీద కాక భగవంతుడి మీదే లగ్నమయింది. భర్త మరణించాడు. నాటి సంప్రదాయం ప్రకారం బొట్టు, జుట్టు, గాజులు తీసి వేయడం వంటి మూఢాచారాలకు ఆమె లొంగలేదు.

వేంగమాంబను సామాజిక కట్టుబాట్లు అనుసరించేటట్లు చేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఆమెనెన్నో కష్టాల పాలు చేశారు. హిరణ్యకశిపుడు పెట్టిన హింసలు ప్రహ్లాదుణ్ణి బాధించనట్లే ఇవన్నీ ఆమెను బాధించలేదు.

వేంగమాంబ అప్రయత్నంగానే ఎన్నో మహిమలు చూపింది. ఆమెకు ఎందరో భక్తులు ఏర్పడ్డారు. ఆమె సహజ పాండిత్యంతో అలవోకగా ఎన్నో రచనలు చేసింది.

వేంగమాంబ సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసింది. ఆమె యక్షగాన రచనలో సిద్ధహస్తురాలు. కవులందరిలో ఎక్కువ యక్షగానాలు రచించిన ఘనత వేంగమాంబదే. తాళ్ళపాక అన్నమయ్యలాగ రాగాలు చెప్పడమేకాక, తన కీర్తనలన్నింటికి ఏ తాళం వాడాలో కూడా చెప్పింది. అన్నమయ్యలాగా చక్కని తెలుగు పలుకుబళ్ళను ఉపయోగించింది. చలివేంద్రాలు, అన్నసత్రాలు ఏర్పాటుచేసింది. నృసింహజయంతి ఉత్సవాలు జరిపింది. 'అష్టఘంటాలు' అనే పేరుతో ఎనిమిది మంది రాతగాళ్ళను నియమించి, తన గ్రంథాలకు ప్రతులు రాయించి, అడిగిన వాళ్ళకు ఇచ్చేది. ఆ విధంగా వేంగమాంబ రచనలు దేశంలో అన్ని ప్రాంతాల వారికి పరిచయం అయ్యాయి.

తానేమి చదువుకోలేదని వినయంగా 'రాజయోగసారము', 'భాగవతము' ద్విపద కావ్యాల్లో ఆమె చెప్పుకుంది.



Scanned with CamScanner



వినరయ్య! కవులార! విద్వాంసులార!
వినరయ్య! మీరెల్ల రసఘాత్ములార!
ఘనయతి ప్రాస సంగతులు నేనెఱుగ
వరుస నాక్షేపించవలదు, సత్కృపను
శ్రీకరంబుగ నారసింహులకరుణ
నీ కథా ప్రారంభమేర్పరించెదను.

ద్విపద రచన వేంగమాంబకు ఇష్టం. తరిగొండలో ఉన్న రోజుల్లోనే నారసింహ శతకం, నారసింహ విలాసకథ, శివనాటకం, రాజయోగసారం, కృష్ణనాటకం, పారిజాతాపహరణం, చెంచునాటకం, శ్రీ కృష్ణమంజరి, శ్రీ రుక్మిణీ నాటకం, ద్విపద భాగవతం, వాసిష్ఠ రామాయణం, ముక్తికాంతా విలాసం, శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, అష్టాంగ యోగసారం అనే గ్రంథాలు రచించింది.

వేంగమాంబ ప్రతిరోజు శ్రీనివాసుడికి ముత్యాలహారతి ఇచ్చేది. అందుకే 'తాళ్ళపాక వారి లాలి, తరిగొండమ్మ హారతి' అనే నానుడి ఏర్పడింది. ఆంధ్రదేశం గర్వించదగిన భక్త కవయిత్రి తరిగొండ వేంగమాంబ.



Scanned with CamScanner

## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అంతరాలు | = | తేడాలు | కట్టుబాట్లు | = | నిబంధనలు |
| శతాబ్దం | = | వంద సంవత్సరాలు | ఆంక్షలు | = | నిర్బంధాలు |
| పాటవం | = | సామర్థ్యం | సిద్ధహస్తురాలు | = | నేర్పరి |
| ద్విపద | = | రెండు పాదాల పద్యం | చలివేంద్రం | = | వేసవిలో మంచినీరు ఇచ్చుచోటు |
| మూఢాచారం | = | అవివేకమైన ఆచారాలు | అనఘాత్ములారా | = | పుణ్యాత్ములారా |

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం



1. వేంగమాంబలో మీకు నచ్చిన లక్షణాలు ఏమిటి?
2. ఆనాటి సమాజ పరిస్థితులు ఎలా ఉండేవి?
3. వేంగమాంబ ఏయే రచనలు చేశారు?

### చదవడం - వ్యక్తపరచడం

**అ) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

**పొణకా కనకమ్మ**



పొణకా కనకమ్మ నెల్లూరు జిల్లా మినగల్లు గ్రామంలో 10-6-1892న జన్మించారు. తండ్రి మరుపూరు కొండారెడ్డి. తల్లి కామమ్మ. మంచి సంపన్న స్థితిలోని కుటుంబానికి చెందినవారు. చిన్నతనంలోనే బాల్యవివాహం జరిగింది. ఆమె అప్పటిదాకా పెద్దగా ఏమీ చదువుకోనట్లే లెక్క. స్వయం కృషితో ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృతాలను నేర్చి పాండిత్యాన్ని సాధించిన విదుషీమణి. సమాజ ఉద్ధరణ ఆమె జీవిత ధ్యేయంగా ఎంచుకొన్నారు. 1913లో నెల్లూరుకు దగ్గరలో ఉన్న పొట్లపూడి గ్రామంలో "సుజన రంజని సమాజం" అనే సేవా సంస్థను స్థాపించి అర్హులకు సేవలు అందజేశారు. ముఖ్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న దీనులకు ఉన్నత స్థితి కల్పించటంలో ఆమె సేవలు సఫలమయ్యాయి. వారి జీవితాలను చీకటినుండి వెలుగులోకి తెచ్చి సఫలీకృతు రాలైనారు కనకమ్మగారు. ఆ ఏడాదే ఆమె స్నేహితులందరూ కలిసి నెల్లూరు రామానాయుడు వంటి వితరణ శీలుర ప్రోత్సాహంతో కొత్తూరు గ్రామంలో "వివేకానంద గ్రంథాలయం" ఏర్పాటు చేసి పుస్తకాలతో విశ్వదర్శనం చేయటానికి గొప్ప అవకాశం కల్పించారు. కనకమ్మగారు జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ గారి శిష్యురాలై గణనీయంగా తన వంతు సేవలందించారు.



Scanned with CamScanner

1. పై పేరాలో ఎవరి గురించి చెప్పారు?

.............................................................................................

2. పొణకా కనకమ్మ ఏ సేవాసంస్థను స్థాపించారు?

.............................................................................................

3. పొణకా కనకమ్మ స్థాపించిన గ్రంథాలయం ఏది? దాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?

.............................................................................................

**ఆ) కింది పేరా చదవండి. తప్పు ఒప్పులను గుర్తించండి.**

**చుండూరు రత్నమ్మ**

తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో రావు బహుదూర్ పైండా వెంకట చలపతి అనే జమీందార్‌గారి పుత్రికారత్నం రత్నమ్మ. 7-2-1891న కాకినాడలో జన్మించారు. చిన్నతనం నుండి దేశం పరాయి వారి పాలన నుండి విముక్తం కావాలని కలలు కనేవారు.

ప్రముఖ గాంధేయ వాది, సంఘ సేవకురాలు, సంఘ సంస్కర్త అయిన రత్నమ్మ 1940లో ఎన్నో వితంతు వివాహాలు జరిపించి సంస్కరణను ఆచరణలోకి తెచ్చిన ఉద్యమశీలి. స్త్రీలు స్వతంత్రంగా తమ కాళ్ల మీద నిలబడాలన్నది ఆమె ధ్యేయం. అందుకోసం వారి ఉపాధికోసం "మహిళా పారిశ్రామిక సంఘం" ఏర్పరిచారు. ఇందులో కుల, మత వివక్షను పాటించకుండా దళిత, అనాథ మహిళలకు స్థానం కల్పించి వారికి కుట్టుపనిలో శిక్షణ ఇప్పించి, కుట్టు మిషన్లు కొని అందజేసిన దీన జన బాంధవురాలు.

"విద్య అందరి హక్కు" అని రత్నమ్మ నమ్మారు. అందుకోసం విద్యా గ్రంథాలయాలు ఏర్పరిచారు. సంస్కృతం, తెలుగు నేర్పటమే కాక సంగీతం, నృత్యం మొదలైన కళలలో ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఆర్థిక సాయం అందించారు. తనలాగే స్త్రీ జనాభ్యున్నతి కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారికి కావలసిన ఆర్థిక సదుపాయాలు అందజేసి వారి వికాసానికి తోడ్పడ్డారు.

1. చుండూరి రత్నమ్మ నెల్లూరు జిల్లాలో జన్మించింది. (   )
2. స్త్రీలు స్వతంత్రంగా తమ కాళ్ళమీద నిలబడాలన్నది ఆమె ధ్యేయం. (   )
3. 'విద్య అందరి హక్కు' అని రత్నమ్మ నమ్మారు. (   )
4. చుండూరు రత్నమ్మ 2-7-1981లో జన్మించారు. (   )

**ఇ) కింది పేరా చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.**

**జయంతి సూరమ్మ**



తాగుడు వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ "కల్లు మానండోయ్ బాబూ" అంటూ ధర్నా చేశారు జయంతి సూరమ్మ. ఈమె 1887లో శ్రీకాకుళం జిల్లా కవిటి అగ్రహారంలో పుట్టారు. కందుకూరి వీరేశలింగంగారి ప్రభావంతో సంఘసేవే పరమావధిగా భావించారు. ఆ రోజుల్లోనే తాగుబోతుల వెకిలి వేషాలను ప్రహసనాలుగా చేసి ప్రదర్శించేవారు.



Scanned with CamScanner

దాంతో ప్రజలకు బుద్ధివచ్చి "కల్లు జోలికి పోము" అని శపథం చేసారు. జయంతి సూరమ్మ లాగే దువ్వూరి సుబ్బమ్మ, దూబగుంట రోశమ్మ మద్యపాన నిషేధానికి కృషి చేశారు.

కాలం మారుతున్నా సమాజంలో ఈ తాగుడు చాపకింద నీరులాగా వ్యాపిస్తూ ఉంది. ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి నేడు ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తోంది. బెల్టుషాపులను రద్దు చేసింది. అమ్మకాలను కట్టడి చేసింది. ఈ చర్యలవల్ల ఎన్నో కుటుంబాల జీవితాలు ఆనందమయం అవుతున్నాయి.

1) ..........................................................................................

2) ..........................................................................................

3) ..........................................................................................

4) ..........................................................................................



## పదజాలం

**కింది పేరా చదవండి. గీత గీసిన పదాలు మన తెలుగు పలుకుబడులు (జాతీయాలు) ఇవి భాషకు అందాన్నిస్తాయి.**

బాలలందరూ అన్నెంపున్నెం ఎరుగని వాళ్ళు, కల్లాకపటం తెలియనివారు. అల్లారుముద్దుగా పెరిగినవారు. అరునూరైనా వాళ్ళు అనుకున్నది చేస్తారు. అడపాదడపా అల్లరి చేస్తుంటారు. స్నేహానికి ఈడుజోడు చూసుకుంటారు. కొందరు మాటల్లో ఆరితేరినవారు. మరి కొందరు తలలోనాలుకలా ఉంటారు. ఆబాలగోపాలం పిచ్చాపాటితో జీవితం గడిపేస్తుంటారు.

పై పలుకుబడులకు అర్థాలు చూడండి. వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

..........................................................................................

..........................................................................................

..........................................................................................



## స్వీయరచన

1. వెంగమాంబలో మీకు నచ్చిన గుణాలు ఏంటి?
2. స్త్రీలు నేడు ఏయే రంగాలలో పనిచేస్తున్నారు?
3. పొణకా కనకమ్మ, చుండూరు రత్నమ్మ, జయంతి సూరమ్మల గురించి తెలుసుకున్నారు కదా! వారు వేటి కోసం పోరాడారో సొంతమాటల్లో రాయండి.



## సృజనాత్మకత

**స్త్రీల గొప్పతనాన్ని తెలిపే కొన్ని నినాదాలు తయారుచేయండి.**



Scanned with CamScanner



## ప్రశంస

మీ తరగతిలో అమ్మాయిలు అన్ని రంగాలలో ముందున్నారు. అంటే బాగా చదువుతారు, ఆటల్లో రాణిస్తారు, నృత్యాలు చేస్తారు, పాటలు పాడుతారు. కార్యక్రమాలు నిర్వహిస్తారు. పరిశుభ్రత పాటిస్తారు. వాళ్ళని మీరు ఎలా అభినందిస్తారు.



## భాషాంశాలు

సామాన్య వాక్యం క్రియా సహిత వాక్యం, క్రియా రహిత వాక్యం అని రెండు రకాలు. క్రియా సహిత వాక్యంలో ఒక సమాపక క్రియ ఉంటుంది. క్రియా రహిత వాక్యంలో క్రియా పదం ఉండదు.



**క్రియా సహిత వాక్యం**

ఉదా : పాప పాలు తాగుతుంది.
జాన్ సినిమా చూస్తున్నాడు.

**క్రియా రహిత వాక్యం**

ఉదా : వాడు నా తమ్ముడు.
అతను మంచి ఆటగాడు.

**సంశ్లిష్ట వాక్యం**

వాక్యంలో ఒక సమాపకక్రియ, ఒకటి లేదా అంతకు మించి అసమాపక క్రియలు ఉంటే అది సంశ్లిష్ట వాక్యం.

శామ్యూలు పాఠం చదివి, అన్నం తిని, నిద్రపోయాడు.

**సంయుక్త వాక్యం**

వాక్యంలో ఒకటి కంటే ఎక్కువ సమాపక క్రియలు ఉంటే అది **సంయుక్త** వాక్యం.
ఇస్మాయిల్ ఊరికి వెళ్ళాడు; వచ్చాడు.
రత్నాలు పాలు తాగింది; వెంటనే నిద్రపోయింది.

**కింది వాక్యాలను చదవండి. సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించండి.**

1. లలిత పాట పాడింది. ..............................................
2. శారద టిఫిన్ తిన్నది, కాఫీ తాగింది. ..............................................
3. బలరాం సంతకు వెళ్ళి, కూరగాయలు తెచ్చాడు. ..............................................
4. వివేకానందుడు షికాగోలో ఉపన్యసించాడు. ..............................................
5. సౌజన్య చాలా తెలివైనది, చురుకైనది. ..............................................
6. కమల పరీక్షలు రాసి, ఊరికి వెళ్లింది. ..............................................



Scanned with CamScanner

## ధారణ చేద్దాం

కేయూరాణి న భూషయంతి పురుషం
హారా న చంద్రోజ్జ్వలాః
న స్నానం న విలేపనం న కుసుమం
నాలంకృతా మూర్ధజాః
వాణ్యేకా సమలఙ్కరోతి పురుషం
యా సంస్కృతాధార్యతే
క్షీయంతే ఖిల భూషణాని సతతం
వాగ్భూషణం భూషణం.

భావం :- మనిషికి అందాన్నిచ్చేవి కడియాలు, మురుగులు, ధగధగలాడే నగలు కాదు. సువాసనలూరే లేపనాలతో స్నానం, పూలు అలంకరించిన జడలు ఇవేవి అందాన్నివ్వవు. వ్యక్తికి అందాన్నిచ్చేది, ఆ వ్యక్తి యొక్క సంస్కారవంతమైన మాట తీరే. ఏనాటికీ నిలిచేది వాగ్భూషణమే.

- భర్తృహరి సుభాషితం

## చదువుదాం

# కవిత్రయం

"తింటే గారెలే తినాలి. వింటే భారతమే వినాలి" అనే సామెత విన్నారు కదా! మహాభారతాన్ని సంస్కృతంలో వేదవ్యాసుడు రాశాడు. నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడలు మహాభారతాన్ని తెలుగులో రాశారు.



నన్నయ్య రాజమహేంద్రవరంలో రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో ఉండేవాడు. నన్నయ 11వ శతాబ్దానికి చెందినవాడు. ఆరాజు కోరికపై సంస్కృతంలో ఉన్న భారతాన్ని నన్నయ తెలుగులో రాశాడు. ఈయన ఆది, సభా పర్వాలను, ఆరణ్యపర్వంలో కొంతభాగాన్ని రాశాడు. నన్నయను 'ఆదికవి' అంటారు. ఈయనకు 'వాగనుశాసనుడు' అనే బిరుదు కూడా ఉంది.



తిక్కన నెల్లూరును పాలించిన మనుమసిద్ధి వద్ద మంత్రిగా ఉండేవాడు. ఈయన 13వ శతాబ్దానికి చెందినవాడు. మహాభారతంలో విరాటపర్వం మొదలు పదిహేను పర్వాలు రాశాడు. ఈయనకు 'కవిబ్రహ్మ', 'ఉభయకవి మిత్రుడు' అనే బిరుదులు ఉన్నాయి. తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' అనే మరో కావ్యం కూడా రాశాడు.



ఎర్రన అద్దంకిని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉండేవాడు. ఎర్రన 14వ శతాబ్దం వాడు. భారతంలో అరణ్యపర్వంలో నన్నయ రాయగా మిగిలిన భాగాన్ని ఎర్రన పూర్తి చేశాడు. ఎర్రన 'హరివంశం' 'నృసింహపురాణం' కూడా రాశాడు. ఈయనకు 'ప్రబంధ పరమేశ్వరుడు', 'శంభుదాసుడు' అనే బిరుదులున్నాయి.

Y2X4W9



Scanned with CamScanner

# 10. మంచి బహుమతి

Q5M8R1




**చిత్రం చూడండి. ఆలోచించి మాట్లాడండి.**

1. చిత్రంలో ఏం జరుగుతున్నది?
2. ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
3. ఇలాంటి ప్రదర్శనకు నీవు వెళితే ఎలాంటి పుస్తకాలు కొంటావు?



Scanned with CamScanner

# మంచి బహుమతి





ఆ రోజు వియాన్ పుట్టినరోజు. వియాన్‌కు అందరూ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. బహుమతులు ఇచ్చారు. వియాన్‌కి వాళ్ల మామయ్య ఒక బహుమతి తెచ్చాడు.

మామయ్య : ఇదిగో వియాన్! నీకొక ప్రత్యేకమైన బహుమతి.

వియాన్ : ఏంటి మామయ్యా! అబ్బో! కథల పుస్తకాలు.

మామయ్య : అవునురా! నీకు పుస్తకాలంటే ఇష్టం కదా! నువ్వు కూడా పుస్తకాలు చదివి గొప్పవాడివి కావాలని.

వియాన్ : పుస్తకాలు చదివితే గొప్పవాళ్ళవుతారా మామయ్యా? పుస్తకం చదువుతుంటే చాలా హాయిగా ఉంటుంది. వినోదంగా ఉంటుంది.



మామయ్య : నిజమే! వినోదంతో పాటు బోలెడు విషయాలు తెలుస్తాయి. మీకు తెలుసా! మన మహాత్మాగాంధీకి పుస్తకాలంటే చాలా ఇష్టం. తన ఆలోచనలను పుస్తకాలే ప్రభావితం చేసాయని ఆయన చెప్పేవారు. పుస్తక పఠనానికి ఎక్కువ సమయం వెచ్చించేవారు. "ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్ యు" అనే పుస్తకం తనని అహింసవైపుకు నడిపించిందని బాపూజీ చెప్పేవారు. తన అభిప్రాయాలు ప్రజలంతా చదివి తెలుసుకోవాలని గాంధీజీ ఎన్నో వ్యాసాలు, పుస్తకాలు రాశారు.



Scanned with CamScanner

వియాన్ : అందుకే గాంధీజీ అంత గొప్పవాడయ్యాడన్నమాట!

మామయ్య : అవును. పుస్తక పఠనం అలాంటిదిరా. అంతెందుకు భగత్‌సింగ్‌ను ఉరి తీసేముందు కోరిక ఏమిటో చెప్పమన్నప్పుడు ఆయన కోరిన కోరిక ఏమిటో తెలుసా ?



వియాన్ : ఏం కోరాడు మామయ్యా?

మామయ్య : తనకిష్టమైన లెనిన్ రచించిన 'రాజ్యం-విప్లవం' అనే పుస్తకాన్ని చదవాలన్నాడు. తనను ఉరి తీసేముందు తనకు ఆ పుస్తకాన్ని చదవడానికి కాస్త సమయం ఇవ్వమని అడిగాడు. పుస్తకం పూర్తిగా చదివాక ఉరికంబం ఎక్కాడు. పుస్తకాలు చదవడం అంటే ఆయనకు అంత పిచ్చి.

వియాన్ : నాకివన్నీ తెలియవు మామయ్యా! చాలా ఆసక్తిగా ఉంది. మరి కొందరి గురించి చెప్పవా.

మామయ్య : డా. బి.ఆర్. అంబేద్కర్ తెలుసుకదా నీకు. మన రాజ్యాంగ నిర్మాత. ఆయన అమెరికా, ఇంగ్లాండులో చదువుకున్నవాడు. తిరిగి భారతదేశానికి వచ్చేటప్పుడు ఆయన తెచ్చుకున్నది పుస్తకాలే. ఆయన రోజూ రాత్రి 2.00 గంటల వరకు పుస్తకాలు చదివేవారు. ఆయన సొంత గ్రంథాలయంలో 52 వేల పుస్తకాలు ఉండేవి.



వియాన్ : అమ్మో! అన్ని పుస్తకాలే ...

మామయ్య : ఆయన చనిపోయేవరకు చదువుతూనే ఉన్నారు. ఆయన 32 పుస్తకాలు రచించారు. తన జీవిత కాలంలో 23 పట్టాలు (డిగ్రీలు) సాధించారు. భారతదేశ చరిత్రలో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించారు. ఇంకోటి తెలుసా ఆయన అందరికన్నా ముందు గ్రంథాలయంలోకి వెళ్ళి పుస్తకాలు అన్నీ చదివి ఆఖరున బయటికి వచ్చేవాడు.

వియాన్ : మా పాఠశాలలో కూడా గ్రంథాలయం ఉంది. నేను, నా స్నేహితులూ వెళ్తాము. నాకు పుస్తకాలు చదవడం చాలా ఇష్టం మామయ్య.


మామయ్య : అది మంచి అలవాటు రా! సరోజినీనాయుడు తెలుసా! ఆమెకు కూడా మీకు లాగే పుస్తకాలంటే బోలెడు ఇష్టమట. చదివేటప్పుడు ఏమైనా సందేహాలు వస్తే వెంటనే ఇంట్లోవాళ్లను, టీచర్లను అడిగి తెలుసుకునేదాకా ఊరుకునేదే కాదట. పదమూడేళ్ళకే "సరోవర రాణి" అనే పుస్తకాన్ని రాసి అందరితో శభాష్ అనిపించుకుందట.



వియాన్ : మా శీను కూడా అంతే మామయ్యా. పుస్తకాన్ని చదివినంత సేపు ఇదేంటి? అదేంటి? అని ప్రశ్నలు అడుగుతూనే ఉంటాడు.



Scanned with CamScanner



మామయ్య : అలా అడిగి తెలుసుకుంటేనే మనం చదివేది అర్థమవుతుంది. మెల్లమెల్లగా చదవడం ఒక అలవాటుగా మారుతుంది. మన మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాం తాను అంత అత్యున్నత స్థాయికి చేరడానికి పుస్తకాలే కారణమని అన్నారు. పుస్తకాలు "శాశ్వత స్నేహితులు" అంటారాయన.

వియాన్ : నిజమే మామయ్యా! పుస్తకాలు మనకు చాలా విషయాలు నేర్పుతాయి. మా బడిలో "మంచి పుస్తకమే మంచి స్నేహితుడు" అని రాసి ఉంటుంది.

మామయ్య : అవును ... పుస్తకాలే మనకి నిజమైన నేస్తాలు.

### పదాలు-అర్థాలు

బహుమతి = కానుక  అహింస = హింసలేని  సరోవరం = కొలను / చెరువు

నిర్మాత = తయారు చేసినవారు  మాజీ = మునుపటి  నేస్తాలు = స్నేహితులు

## ఇవి చేయండి



### వినడం - ఆలోచించి మాట్లాడటం

1. పుస్తకాలను ఎందుకు చదవాలి?
2. మీరు ఏమేమి పుస్తకాలు చదివారు? పుస్తకాలు చదివేటప్పుడు మీకు ఏమనిపిస్తుంది?
2. మీకు నచ్చిన పుస్తకం గురించి చెప్పండి.
3. మీ స్నేహితులు ఏ పుస్తకాలు చదివారో తెలుసుకోండి. వాళ్ళకు ఆ పుస్తకాలు ఎందుకు నచ్చాయో అడగండి.



### చదవడం - వ్యక్తపరచడం

**అ) పాఠం చదివారు కదా! పాఠం ఆధారంగా కింది మాటలు ఎవరివో రాయండి.**

1. తన ఆలోచనలను పుస్తకాలే ప్రభావితం చేసాయని ఆయన చెప్పేవారు.

.....................................................................................................

2. ఉరి తీసేముందు పుస్తకాన్ని చదవటానికి కాస్త సమయం ఇవ్వమని అడిగాడు.

.....................................................................................................

3. చదివేటప్పుడు సందేహాలు వస్తే వెంటనే ఇంట్లో వాళ్ళను, టీచర్లను అడిగి తెలుసుకునే దాకా ఊరుకునేదే కాదట.

.....................................................................................................



Scanned with CamScanner

4) ఆయన రోజూ రాత్రి 2.00 గంటల వరకు పుస్తకాలు చదివేవారు.

.................................................................................................

**ఆ) కింది పేరా చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



మనిషి పుట్టిన చాలా కాలానికి భాష పుట్టింది. సైగల రూపంలో ఉండేభాష. కాలక్రమంలో వాగ్రూపం ధరించింది. ఆ తర్వాత బొమ్మల రూపంలో, అక్షరాల రూపంలో లిపి ఏర్పడింది. లిపి ఏర్పడిన తరువాత ప్రాచీన మానవులు రాళ్ళపైన, గోడలపైన సమాచారాన్ని చెక్కేవారు. ఆ తరువాత చాలా కాలానికి తాటాకులమీద ఘంటంతో రాసేవారు. వాటిని 'తాళపత్ర గ్రంథాలు' అనేవారు. పురాణాలు, ఇతిహాసాలు వాటిపైనే రాసేవారు. ఆ తరువాత కాలంలో రాగిరేకులపై రాసారు. ఆ తరువాత ఎన్నో అన్వేషణలు చేసి కాగితాన్ని కనుగొన్నారు. కాగితం కనుక్కోవడం ఒక మైలురాయి. అయితే క్రీ.శ. 1440 సంవత్సరంలో జాన్ గూటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనుగొనడం మరో మైలురాయి. అలా రకరకాల బొమ్మలతో, రంగులతో అక్షరాలతో పుస్తకం రూపుదిద్దుకొంది.



1. మొట్టమొదట భాష ఏ రూపంలో ఉండేది?

.................................................................................................

2. ప్రాచీన మానవుడు సమాచారాన్ని ఎలా చెప్పేవాడు?

.................................................................................................

3. తాళపత్ర గ్రంథాలు అంటే ఏమిటి?

.................................................................................................

4. అచ్చుయంత్రాన్ని ఎవరు కనుగొన్నారు?

.................................................................................................

5. కాగితం కనుక్కోవడానికి ముందు ఏయే విధంగా సమాచారాన్ని నిక్షిప్తం చేసేవారో వరుస క్రమంలో రాయండి.

.................................................................................................

**ఇ) కింది పేరా చదవండి. వీలైనన్ని ప్రశ్నలు రాయండి.**

"పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం వంటిది" అన్నాడొక మహనీయుడు. శరీర పోషణకు తిండి ఎంత అవసరమో బుద్ధిని వికసింపజేయడానికి పుస్తకాలు చదవడం అంతే అవసరం. పుస్తకాలు చదవడం వల్ల మంచి చెడులు తెలుస్తాయి,



Scanned with CamScanner

తెలివితేటలు పెరుగుతాయి. పుస్తకాలు మిమ్మల్ని ఒక అద్భుత ప్రపంచంలోకి తీసుకువెళతాయి. మిమ్మల్ని ఆనందంలో ముంచెత్తుతాయి. మిమ్మల్ని ఆలోచింప చేస్తాయి. మీ మెదడుకు పదును పెడతాయి. పుస్తకాలు చదువుతూ ఉంటే ఎంతో పదజాలం నేర్చుకోవడమే కాకుండా ఎందరి ఆలోచనలో తెలుసుకుంటారు. విజ్ఞానం, వినోదంతో బాటు ఎలా జీవించాలో పుస్తకాలు నేర్పుతాయి. అందుకే పుస్తకాలు నిజమైన నేస్తాలు.

1. ..........................................................................................


2. ..........................................................................................

3. ..........................................................................................



## పదజాలం

అ) **పుస్తకాలు చదవడం వల్ల మీరు ఏమేమి పొందుతారో రాయండి.**






ఆ) **పుస్తకాలు వివిధ ప్రక్రియలలో ఉంటాయి. వాటిలో కింది ప్రక్రియలు చూడండి. మీరు ఏయే ప్రక్రియల పుస్తకాలు చదివారో వాటికి '◯' చుట్టండి.**

| | | | |
|---|---|---|---|
| గద్యం | పాటలు | కథనం | కైఫియత్‌లు |
| పద్యం | నానీలు | దినచర్య | చారిత్రక విశేషాలు |
| లేఖలు | కవితలు | ముఖాముఖి | కథల పుస్తకాలు |
| వ్యాసాలు | నాటకాలు | సంభాషణలు | యాత్రా విశేషాలు |

ఇ) **కింది వాక్యాలు చదవండి. అవును, లేదు రాయండి.**

1. మీ పాఠ్యపుస్తకాలు కాకుండా మీరు ఇతర పుస్తకాలు చదివారా? ( )
2. కథల పుస్తకాలు చదవడానికి ప్రత్యేక సమయాన్ని కేటాయించారా? ( )
3. కథల పుస్తకాలు చదివిన తర్వాత మీకు ఆనందం వేసిందా? ( )
4. టి.వి. చూడడానికన్నా పుస్తకాలు చదవడానికే మీరు ఇష్టపడతారా? ( )
5. ఇతర పుస్తకాలు చదవడం వల్ల అదనపు సమాచారం తెలుస్తుందా? ( )



Scanned with CamScanner

ఈ) కింది సంభాషణ చదవండి. దీనిలో చెప్పిన తమాషా పదాలవంటి వాటిని మీరు మరికొన్ని తయారు చేయండి.

లటుకు : ఒరే చిటుకూ! మన తెలుగుభాషలో అన్నిటికన్నా పెద్ద మాట, పొడుగాటిమాట ఏదో చెప్పగలవా?

చిటుకు : ఓ! "అమందానందకందళితహృదయారవిందుడు".



లటుకు : అబ్బే! అది చాలా చిన్నది. నేను చెప్పనా? "గజానన".

చిటుకు : అదెలాగా?

లటుకు : "గజానన" పదంలో మొదటి అక్షరానికి, ఆఖరు అక్షరానికి మధ్య 'జాన' వుంది. జాన అంటే 9 అంగుళాలన్న మాట.

చిటుకు : అయితే కాచుకో. నేను అంతకన్నా పెద్దమాట చెప్పగలను. "దిగ్గజములు" ఇందులో మధ్యలో ఒక గజము వుంది తెలుసా?

లటుకు : ఓస్! అయితే ఇది విను, "ప్రయోజనం". ఇందులో 'యోజనం' దూరం ఉంది తెలుసా?

చిటుకు : అయితే అంతకన్నా పెద్దమాట చూడు! "అఖండంగా!" ఒక ఖండం మధ్యనుంది. ఔనా!

లటుకు : అయితే అన్నిటికన్నా పొడుగుమాట "ఖగోళంలో" ఉంది.

పై గీత గీసిన పదాలలో ఇంకో పదం దాగి ఉంది కదా! అలాంటి పదాలు మీరు తెలుసుకొని రాయండి.

.................................... ....................................

.................................... ....................................

ఉ) మీ పాఠశాల గ్రంథాలయంలో ఏమేమి పుస్తకాలు ఉన్నాయో చూడండి. వాటి పేర్లు రాయండి. ఏ పుస్తకం ఎవరు రాశారో పట్టికలో నింపండి.

| పుస్తకం పేరు | రాసిన వారు |
|---|---|
| | |



## స్వీయరచన



అ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. భగత్‌సింగ్ ఏ కోరిక కోరాడు?
2. మీరు చదివేటప్పుడు సందేహం వస్తే ఏం చేస్తారు?
3. పుస్తకాలు చదవడం ద్వారా గొప్పవారైన వారి గురించి తెలుసుకున్నారు కదా! పుస్తకాలు చదవడం వల్ల మనకు కలిగే లాభాలేంటి?
4. మీరు చదివిన పుస్తకం గురించి, అది మీకు ఎందుకు నచ్చిందో రాయండి.



Scanned with CamScanner



## సృజనాత్మకత

**"పుస్తకం హస్త భూషణం"** అంటే చేతికి పుస్తకమే ఒక అలంకరణ. ఇది ఒక సూక్తి. ఇలాంటి సూక్తులు కింద మరికొన్ని ఉన్నాయి. చదవండి. ఇలాంటి సూక్తులను సేకరించి రాయండి.

> పుస్తకం నోరు విప్పని మహావక్త.

> మంచి పుస్తకం తెరచి ఉంచిన దేవాలయం.



## ప్రశంస

**మంచి పుస్తకాన్ని మీ మామయ్య బహుమతిగా ఇచ్చాడు. మీ మామయ్యతో మీ సంతోషాన్ని ఏవిధంగా వ్యక్తపరుస్తావో రాయండి.**



## భాషాంశాలు

**అ) కింది వాక్యాలను చదవండి.**

1. 'ఆహా! ఆ బంగారు లేడి ఎంత బాగున్నది!' అని సీత రాముడితోఅన్నది.
2. అయ్యో! పడిపోయావా.
3. కవి ప్రతిభను ఔరా! అని మెచ్చుకున్నారు.
4. భళా! ఈ వినోదం అందరికీ అవసరం.
5. 'అమ్మో!' ఆ కుక్క కరుస్తుంది.

గీతగీసిన పదాలను పరిశీలించండి. ఆహా!, అయ్యో!, ఔరా! ..... ఇటువంటి పదాలకు, లింగ భేదం కానీ, వచన భేదం కానీ విభక్తి భేదం కానీ ఉండదు. ఇటువంటి పదాలను **అవ్యయాలు** అంటారు.

ఉదా : ఆహా, ఔరా, అబ్బా, ఓహో మొ॥

**ఆ) కింది వాక్యాలను చదవండి. 'అవ్యయము' లను గుర్తించండి.**

1. 'ఆహా! ఈ భవనము ఎంత సుందరముగా ఉన్నది?
2. ఔరా! ఎంత పని చేశావు?
3. అరె! అలా ఎందుకు జరిగింది?
4. అయ్యో! నేను చెప్పేది వినవా?
5. ఏమీ! నేను రాకుండానే వెళ్లారా?



Scanned with CamScanner

ఇ) ముందు పాఠాల ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| నామవాచకం | సర్వనామం | క్రియ | విశేషణం |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |



## ధారణ చేద్దాం

తనువు, రక్తంబు, జీవంబు ధారవోసి
ఋషి వతంసులు పెక్కు వేలేండ్లు తపము
సలిపి ఆర్జించినట్టి విజ్ఞాన ధనము
దాచి యుంచిన పేటి గ్రంథాలయమ్ము

**భావం :-** ఋషి శ్రేష్ఠులు వేల సంవత్సరాలు తపస్సు చేసి శరీరం రక్తం ధారపోసి జ్ఞానాన్ని సంపాదించారు. ఇలాంటి జ్ఞాన ధనాన్ని దాచి పెట్టిన పెట్టెలాంటిది గ్రంథాలయం.

– నాళం కృష్ణారావు



## చదువుదాం

## నవ్వుల తాతయ్య చిలకమర్తి

గమ్మత్తుగా మాట్లాడితే నవ్వొస్తుంది. ఒక మాటకే రెండు మూడు అర్థాలు వచ్చేటట్లు మాట్లాడితే నవ్వొస్తుంది. మాటలతో ఏడ్చేవాళ్ళను నవ్వించొచ్చు, నవ్వేవాళ్ళను ఏడ్పించవచ్చు. చిన్న పిల్లలు, పెద్దలు అందరూ నవ్వేటట్లు ఈ చిలకమర్తి లక్ష్మీ నరసింహం తాతయ్య చాలా కథలు రాశారు. 1890 సంవత్సరంలో ఒకరోజున "ఏమండీ! ఒక పద్యం చెప్పరూ" అని ఒకళ్ళు అడిగారట. "నాయనా! పూర్వం పద్యం చెపితే బంగారం, వెండి యిచ్చేవారు. ఇప్పుడు పకోడీ అయినా యిచ్చేవాళ్ళులేరు" అని పకోడి మీద ఈ కింది పద్యం చెప్పారు.

క. ఆ కమ్మదనము నారుచి
యా కరకర యా ఘుమఘుమ యా పొంకము లా
రాకలు పోకలు వడుపులు
నీకే దగు నెందులేవు నిజము పకోడీ



Scanned with CamScanner

P9A4F5

మన దేశంలోను, మన వూళ్ళోను, మన యింట్లోనూ, మనలోను వుండే గమ్మత్తులన్నీ, వీరు కథల్లో, రాశారు వాటిలో కొన్ని గమత్తులు చూడండి.

హరి : ఈ వీధి యెక్కడికి వెడుతుందండి?

శంకరం : ఈ వీధి ఎక్కడికీ వెళ్ళదు. నా చిన్నతనంనుండి. నేను చూస్తున్నాను. ఇది ఇక్కడనే ఉంటుంది.

హరి : మీ యింట్లో కూరలు యీ రోజున యేమి చేసినారండి?

శంకరం : ఏమి చేస్తాం - తిన్నాం.

హరి : మీ వూళ్లో బడి సరిగా జరుగుతున్నదా?

శంకరం : ఒక్క అంగుళమయినా జరగటం లేదు. మునుపున్న చోటనే ఉన్నది.

హరి : మీరు ఈ రోజున యేమి యెక్కివచ్చినారండీ.

శంకరం : ఏమెక్కి? పొద్దెక్కి, ఎండెక్కి వచ్చాం.

హరి : మీరు ఏ నీళ్లు తాగుతారు? చెరువునీళ్లా? నూతినీళ్లా?

శంకరం : అదియేటో మాకు తెలియదు. మేము మంచినీళ్లు తాగుతాం.

హరి : ఏ పాలు పుచ్చుకొంటే మనం చెడిపోతాం?

శంకరం : పాపాలు, కోపాలు.




ఇంకా నవ్వుల తాతయ్య చిలకమర్తి గారి గయ్యాళి గంగమ్మ, ప్లీడరు తమాషా, పెండ్లి కొడుకు ధరలు, గొట్టాలమ్మ, కనకయ్య పంతులకంతి, ఆకాశరామన్న మొదలయినవి చదువుతుంటే కడుపు చెక్కలయ్యేటంత నవ్వు వస్తూ ఉంటుంది.

## కవి పరిచయం

### చిలకమర్తి లక్ష్మీనరసింహం

### (26.9.1867 - 17.4.1946)



చిలకమర్తి లక్ష్మీనరసింహం కవి, నాటకకర్త, నవలాకారుడు. 'గయోపాఖ్యానము', 'కీచకవధ' వంటి నాటకాలు, 'రామచంద్ర విజయము', 'గణపతి' వంటి నవలలు, 'భల్లట', 'కృపాంభోనిధి' శతకాలు రాశారు. స్వీయచరిత్ర రాశారు. కందుకూరి వీరేశలింగం చేపట్టిన సంఘ సంస్కరణ స్ఫూర్తితో దళితుల విద్యాభివృద్ధి కోసం పాఠశాల ప్రారంభించి, నిర్వహించారు.



Scanned with CamScanner

ఒక్క సంగీత మేదో పాడునట్లు భా
షించునప్డు విన్పించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు స్ప
ష్టోచ్చారణంబున నొనరు భాష
రసభావముల సమర్పణ శక్తియందున
సమరభాషకు దీటైన భాష
జీవులలో నున్న చేవయంతయు చమ
త్కృతి పల్కులన్ సమర్పించు భాష

భాష లోకపది తెలిసిన ప్రభువు చూచి
భాష యన నిద్ది యని చెప్పబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించినట్టిది తెలుగు భాష.

– విశ్వనాథ సత్యనారాయణ



రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
ఆంధ్రప్రదేశ్

Scanned with CamScanner